RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 230 మేడ్చల్ మల్కాజ్‌గిరి 11 సెప్టెంబర్ 2024 బుధవారం పేజీలు : 4

## లంబోదరుడికి భారీ లడ్డూ.. ఎన్ని కేజీలంటే..?

దేశవ్యాప్తంగా గణపతి నవరాత్రులు ఘనంగా జరుగుతున్నాయి. పలు ప్రాంతాల్లో విభిన్న రీతుల్లో ఈ వేడుకలు నిర్వహిస్తున్నారు. ఆ క్రమంలో గణనాథునికి నైవేద్యంగా పలు రకాలు స్వీట్లు, పిండి వంటలు నిర్వాహకులు సమర్పిస్తున్నారు. వినాయకుడిని అత్యంత ప్రీతిపాత్రమైన జాబితాలో కుడుములు, ఉండ్రాళ్లే కాదు.. లడ్డూలు సైతం ఉన్నాయి. ఈ నేపథ్యంలో పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని భవానీపూర్ ప్రాంతంలో ఓ స్వీట్ షాపు యాజమాన్యం.. 500 కేజీల లడ్డూను తయారు చేసింది. ఆ లడ్డును సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. ఇది వైరల్ అవుతుంది. డ్రై ఫ్రూట్‌తోపాటు స్వచ్ఛమైన నేతితో ఈ భారీ లడ్డును తయారు చేసినట్లు ఆ స్వీట్ షాపు యజమాన్యం వివరించారు.

# ఆశల పల్లకీలో 'హస్తం' నాయకులు

## ఓ వైపు ఆశ - మరో వైపు ఆందోళన



### పోటీ పడుతున్న సీనియర్లు - కీలక ప్రజా ప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు..

### జోరుగా పైరవీలు చేసుకుంటున్న ఆశావహులు.. - ముందడుగు పడకపోవడంతో అసంతృప్తి

హైదరాబాద్ : హస్తం పార్టీలో పదవుల పందేరానికి తెరలేచింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు పూర్తయినా ఇప్పటికీ పదవుల భర్తీ పూర్తికాలేదు. దీంతో నామినేటెడ్ పదవుల కోసం పోటీ పడుతున్న వారిలో తీవ్ర నైరాశ్యం నెలకొంది. ప్రభుత్వం ఏర్పాటుకు మునుపు జెండా మోసిన వారంతా ఆశలు పెట్టుకున్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అన్నీతామై వ్యవహరించిన వారికి ప్రాధాన్యం లేకపోవడంతో బాహటంగానే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ముందు వచ్చిన చెవుల కన్నా వెనుక వచ్చిన కొమ్ములే గొప్ప అన్నట్లుగా ఇతర పార్టీల నుంచి అవకాశవాద రాజకీయాల కోసం వచ్చిన వారితో కాంగ్రెస్‌లో ప్రచ్ఛన్న యుద్ధం జరుగుతోంది. కాంగ్రెస్ పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు కనీసం పట్టించుకోకుండా ఆర్థిక, సొంత ప్రయోజనాల కోసం పార్టీ మారిన వ్యక్తుల పాత్రనే ఇప్పుడు కీలకంగా మారడంతో.. పాత తరం నాయకులంతా నిట్టూరుస్తున్నారు.

ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వివిధ అవసరాల రీత్యా కాంగ్రెస్ కండువా కప్పుకున్న వారే పెత్తనం చేస్తుండడంపై జెండాలు మోసిన సామాన్య కార్యకర్తలు మండిపడుతున్నారు. నామినేటెడ్ పదవుల భర్తీలోనూ కొత్తగా పార్టీలోకి వచ్చిన వారిదే హవా కొనసాగుతుండడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**పదవుల భర్తీలో అస్పష్టత...** నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో పలు మార్కెట్ కమిటీ పాలకవర్గాలు మినహాయిస్తే మిగిలిన ఏ నామినేటెడ్ పోస్టుల భర్తీ ముందుకు సాగడం లేదు.ఎమ్మెల్యేల చొరవతో మార్కెట్ కమిటీలు భర్తీ చేసినప్పటికీ కీలకమైన స్థానాల్లో మాత్రం కాంగ్రెస్ నేతలకు చోటు దక్కడం లేదు. ఎమెల్యే, ఎంపీ టికెట్లు ఆశించిన భంగ పడిన వారికి రాష్ట్ర స్థాయిలో పలు కార్పొరేషన్ పదవులను పీసీసీ కట్టబెట్టి వారిని చల్లబర్చింది. రాష్ట్ర స్థాయిలో కీలకంగా వ్యవహరించిన నేతలను సముదాయించినప్పటికీ ద్వితీయ శ్రేణి నాయకులను సంతృప్తి పర్చడంలో కాంగ్రెస్ పార్టీ విఫలం అవుతోంది. ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు కావస్తున్నప్పటికీ ఇప్పటివరకూ స్పష్టత లేకపోవడంపై క్యాడర్ నిరాశకు గురవుతున్నది. ఇదేం తీరు? అంటూ నిలదీస్తున్నారు. ఇంకెప్పుడు పదవుల భర్తీ చేపడుతారు? అంటూ ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు లేనిచోట అన్నీ తామై వ్యవహరిస్తున్న కాంగ్రెస్ నేతలంతా నయానో భయానో అధికార దర్పాన్ని ప్రదర్శిస్తూ కాలం గడుపుతున్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్న చోట మాత్రం అలాంటి పప్పులు ఉడకక పోవడంతో మిన్నకుంటున్నారు. ఎమ్మెల్యే చేతి కింద పని చేసుకుంటూ కాలం వెళ్లదీస్తున్నారు. పదవుల కోసం కీలక నేతలను అడిగితే సాగదీసుడు తప్ప స్పష్టమైన హామీ ఇవ్వకపోవడంపై కాంగ్రెస్‌లో అసంతృప్తి రోజురోజుకూ పెరుగుతోంది.

**ఆశాభంగం...** ఓ వైపు జిల్లా స్థాయిలో నామినేటెడ్ పదవుల భర్తీ, మరోవైపు కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ కూర్పులో మార్పులు చేర్పులపై హస్తం నేతలు భారీగా ఆశలు పెట్టుకుంటున్నారు. నామినేటెడ్ పోస్టుపై ఆశ పడితే కనీసం పార్టీ పోస్టుతోనైనా సరిపెట్టుకోవచ్చన్న ధోరణిలో ముఖ్య నాయకులంతా తమ పలుకుబడిని ఉపయోగించుకుంటూ పైరవీలు చేసుకుంటున్నారు. కానీ వారికి అడుగడుగునా ఆశాభంగమే ఎదురవుతున్నది.పీసీసీ నేతలను తరచుగా భేటీ అవుతూ భర్తీ ప్రక్రియలో చోటు కోసం వేడుకుంటున్న వీరి గోడు వినకపోవడంపై లోలోపల నేతలంతా కుమిలి పోతున్నారు. ఆశాభంగంతో నిరాశకు గురవుతున్నారు. మరోవైపు త్వరలోనే స్థానిక సంస్థల పోరుకు ప్రభుత్వం సిద్ధం అవుతున్న దరిమిలా గ్రామ, మండల, జిల్లా స్థాయిలో స్థానిక సంస్థల్లోనూ కీలకమైన ఎంపీపీ, జడ్పీటీసీ, జడ్పీ చైర్మన్ పదవులపైనా చాలా మంది కన్నేశారు. ఇప్పటి నుంచే జోరుగా నమ్మకంతో నేతల చుట్టూ తిరుగుతున్నారు. ఉమ్మడి జిల్లాలో మంత్రి పదవి రేసులో ఉన్న కీలక నేతలు ఈ పదవుల భర్తీకి అడ్డుపుల్లలు వేస్తున్నట్లు కాంగ్రెస్‌లో గుసగుసలు వినిపిస్తున్నాయి. మంత్రివర్గ విస్తరణ కాకముందే జిల్లాల్లో కీలకమైన పోస్టులను భర్తీ చేసేది లేదని భీష్మించుకుని కూర్చున్నట్లుగా తెలుస్తోంది. ఉభయ జిల్లాల్లో జిల్లా గ్రంథాలయ పరిషత్ చైర్మన్, నిజామాబాద్ మార్కెట్ కమిటీ, నిజామాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, దేవాదాయ శాఖ పరిధిలోని ఆలయాలకు పాలకవర్గాల్లో నియామకాల ప్రక్రియలో ఎలాంటి చలనం లేకుండా పోయింది. దీనంతటికీ మంత్రివర్గ కూర్పు లేకపోవడమే కారణమని తెలుస్తోంది. మంత్రివర్గ విస్తరణ తర్వాతే నామినెటెడ్ పదవుల భర్తీ ఉంటుందనేది కీలక నేతలు చెబుతుండడంతో ద్వితీయ శ్రేణి నాయకులు మండిపడుతున్నారు.

## 499మందిలో ఏ ఒక్కరికీ రుణమాఫీ కాలేదు: ఎమ్మెల్యే కేటీఆర్..



హైదరాబాద్: స్వాతంత్ర్య భారతదేశంలోనే రైతు రుణమాఫీ పేరుతో కాంగ్రెస్ అతి పెద్ద మోసం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికలకు ముందు తెలంగాణ ప్రజలకు మాయమాటలు చెప్పి రైతులను నిండా ముంచారని కేటీఆర్ మండిపడ్డారు. ఇందుకు ఉదాహరణే నాగర్ కర్నూల్ జిల్లా పెంటవెల్లి గ్రామమని ఎక్స్ వేదికగా పోస్టు చేశారు.

పెంటవెల్లిలో 499మంది రైతులు ఉండగా.. ఏ ఒక్కరికీ రుణమాఫీ కాకపోవటం దారుణమంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎమ్మెల్యే కేటీఆర్ ట్విటర్‌లో నిప్పులు చెరిగారు. రుణమాఫీ పూర్తిచేశామని గొప్పలు చెప్పుకుంటున్న ముఖ్యమంత్రివి బూటకపు మాటలని చెప్పడానికి ఈ గ్రామమే సజీవ సాక్ష్యమని చెప్పుకొచ్చారు. అంత మంది రైతులు ఉన్న పెంటవెల్లిలో ఒక్కరంటే ఒక్కరికీ మాఫీ కాకపోవడం పచ్చి మోసం కాక మరేమిటంటూ ప్రశ్నలు సంధించారు. గత డిసెంబర్ నుంచి ఈ ఏడాది ఆగస్టు 15 దాకా డెడ్ లైన్లు పెట్టుకుంటూ వచ్చిన సీఎం ఈ గ్రామ రైతులకు ఎందుకు మాఫీ కాలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

పావుశాతం కూడా రుణమాఫీ చేయకుండా వందశాతం అయిపోయినట్టు సీఎం ఫోజులు కొడుతున్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే వెంటనే పెంట్లవెల్లి రైతులకు రుణమాఫీ చేసి నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. ఈ మేరకు పెంటవెల్లి గ్రామ రైతులు రుణమాఫీ కాలేదంటూ నిరసన తెలుపుతున్న వార్తాపత్రిక క్లిప్‌ను ట్వీట్‌కు కేటీఆర్ జతచేశారు.




హైదరాబాద్: గత కొద్ది రోజులుగా వర్షాలతో సతమతమవుతున్నా హైదరాబాద్ సిటీ వాసులకు స్వల్ప ఊరట.. కాలు బయట పెడదామంటే వర్షం..రాత్రి లేదు.. పగల్లేదు..ఆకాషానికి చిల్లు పడిందా అన్న ట్లు వర్షాలు..ఎక్కడ చూసిన నీళ్లే..కాలనీ చెరువులను తలపించాయి. ఇదీ నిన్నటి వరకు హైదరాబాద్ నగర పరిస్థితి.. అయితే నగరవాసులకు వాతావరణ శాఖ ఊరట కలిగించే న్యూస్ చెబుతోంది. రాబోయే వారం రోజుల్లో వర్షాలు తగ్గుముఖం పడతాయని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది.తెలంగాణలో వివిధ జిల్లాల్లో మంగళవారం నుంచి మరో రెండు రోజులు వర్షాలు ఉన్నప్పటికీ సెప్టెంబర్ 12 తర్వాత వర్షాలు ఉన్నట్లు హెచ్చరికలు లేవు. గత కొన్ని రోజులుగా హైదరాబాద్‌లో భారీ వర్షాలు కురుస్తుండగా.. రాబోయే వారంలో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. హైదరాబాద్‌కు వాతావరణ శాఖ ఎలాంటి వర్షపాత హెచ్చరికలు జారీ చేయలేదు. మరోవైపు సెప్టెంబర్ 10 న తెలంగాణ వ్యాప్తంగా కురిసిన వర్షపాతం నమోదు వివరాలను వెల్లడించింది ఐఎండీ.. సోమవారం ములుగు జిల్లాలో అత్యధి కంగా 51.3 మి.మీ వర్షపాతం నమోదు కాగా.. హైదరాబాద్‌లో అత్యధికంగా బండ్లగూడలో 1 మి.మీ వర్షపాతం నమోదైంది.

**ఈసారి రుతుపవనాలతో 42శాతం వర్షపాతం అధికం** : ప్రస్తుత నైరుతి రుతుపవనాల సమయంలో తెలంగాణలో సగటు వర్షపాతం 896.8 మిమీ నమోదైంది.. అయితే సాధారణ వర్షపాతం 631.5 మిమీతో పోలిస్తే 42 శాతం ఎక్కువ. హైదరాబాద్‌లో సాధారణ వర్షపాతం 508.8 మిల్లీమీటర్లకుగానూ 703.4 మిల్లీమీటర్లు నమోదైంది ఇది 38 శాతం అధికం అని ఐఎండీ తెలిపింది. హైదరాబాద్‌లోని నాంపల్లిలో అధిక వర్షపాతం నమోదైంది. సాధారణ వర్షపాతం 501.8 మిమీతో పోలిస్తే 809.6 మిల్లీమీటర్లు నమోదైంది–.

ఇది 61 శాతం ఎక్కువ. IMD హైదరాబాద్ సూచన ఈ వారం భారీ వర్షాల నుంచి ఉపశమనం పొందవచ్చని సూచించినప్పటికీ, ప్రస్తుత నైరుతి రుతుపవనాల సమయంలో తెలంగాణలో మరింత వర్షాలు కురిసే అవకాశం ఉంది. సెప్టెంబర్ నెలాఖరులో ఈ రుతుపవనాలు ముగుస్తాయి.

# భారీ రుణభారం సవాల్‌గా మారింది..




## ఆర్థికసంఘం సమావేశంలో సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్ : ప్రజాభవన్‌లో 16వ ఆర్థిక సంఘం సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. దేశంలోనే తెలంగాణ యంగెస్ట్ స్టేట్ అని తెలంగాణను ది ఫ్యూచర్ స్టేట్‌గా పిలుస్తున్నామన్నారు. దేశంలోనే తెలంగాణ వేగంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రమన్నారు. దేశాభివృద్ధి లో తెలంగాణ కీలక పాత్ర పోషిస్తుందని బలమైన పునాదులు, చక్కటి ఆర్థిక వ్యవస్థ ఉన్నప్పటికీ ఆర్థికంగా తెలంగాణ అనేక సవాళ్లను ఎదుర్కొంటోందన్నారు. భారీ రుణభారం తెలంగాణకు సవాల్‌గా మారిందని.. గత ఆర్థిక సంవత్సరం చివరి నాటికి రుణభారం 6.85 లక్షల కోట్లకు చేరుకుందని వివరించారు. ఇందులో బడ్జెట్ రుణాలతో పాటు ఆఫ్–బడ్జెట్ రుణాలు ఉంటాయన్నారు. గత పదేళ్లలో మౌలిక ప్రాజెక్టులకు, నిధుల సమీకరణకు ప్రభుత్వం భారీగా అప్పులు తీసుకుందన్నారు. రాష్ట్ర ఆదాయంలో ఎక్కువ భాగం రుణాన్ని తిరిగి చెల్లించడానికే వెచ్చించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. రుణాలు, వడ్డీ చెల్లింపులు సక్రమంగా నిర్వహించకపోతే రాష్ట్ర పురోగతిపై ప్రభావం చూపే అవకాశం ఉందని ఈ నేపథ్యంలో రుణాల సమస్యను పరిష్కరించేందుకు తమకు తగిన సహాయం, మద్దతు ఇవ్వాలని కోరుతున్నామన్నారు. రుణాన్ని రీ స్ట్రక్చర్ చేసే అవకాశం ఇవ్వండి.. లేదా అదనపు ఆర్థిక సహాయాన్ని అందించాలన్నారు. కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు పంపిణీ చేసే నిధుల వాటాను 41శాతం నుంచి 50 శాతం పెంచాలన్నారు. అన్ని రాష్ట్రాల తరపున ఈ డిమాండ్‌ను ముందు ఉంచుతున్నామన్నారు. ఈ డిమాండ్‌ను మీరు నెరవేర్చితే దేశాన్ని 5 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మార్చాలని ప్రధాని మోడీ ఎంచుకున్న లక్ష్య సాధనకు సంపూర్ణంగా సహకరిస్తామన్నారు. తెలంగాణకు తగినంత సహాయం అందించాలన్నారు సీఎం రేవంత్‌రెడ్డి. దేశాన్ని ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మార్చడంలో తమ వంతు బాధ్యతను నేరవేరుస్తామన్నారు సీఎం రేవంత్‌రెడ్డి.

**తెలంగాణ ఆర్థిక అభివృద్ధికి సహాయం అందించండి..** రాష్ట్ర ఆర్థిక అభివృద్ధికి సహాయం అందించాలని డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క 16వ ఆర్థిక సంఘాన్ని కోరారు. నేడు ప్రజా భవన్‌లో నిర్వహిస్తున్న 16వ ఫైనాన్స్ కమిషన్ సమావేశంలో భట్టి మాట్లాడుతూ.. పన్నుల నుంచి తెలంగాణకు వచ్చే ఆదాయం వాటాను 41% నుంచి 50% పెంచాలని కోరారు. రైతు భరోసా, రైతు రుణమాఫీ రాష్ట్రానికి జీవరేఖ లాంటివని.. ఈ రాష్ట్ర ప్రజలకు ఆర్థిక భరోసాలు, అధిక భద్రతను కల్పిస్తాయన్నారు. కేంద్ర పథకాలను వినియోగించుకోవాలంటే తరచూ కఠినమైన నిబంధనలు విధిస్తున్నారన్నారు. ఫలితంగా కేంద్ర ప్రాయోజిక పథకాలను పొందడంలో రాష్ట్రాలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయన్నారు. రాష్ట్రాలు తమ అవసరాలు కనుగుణంగా కేంద్ర ప్రభుత్వ పథకాలను రూపొందించడానికి స్వయం ప్రతిపత్తిని అందించాలని భట్టి కోరారు. తెలంగాణ రాష్ట్రం కీలక దశలో ఉన్నదని... వేగంగా అడుగులు వేస్తోందన్నారు. గత ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి 6.85 లక్షల కోట్లకు పైగా రుణపాఠంతో సతమతం అవుతున్నదన్నారు. సెస్‌లు, సర్ చార్జీల్లో రాష్ట్రాలకు వాటా ఇవ్వాలన్నారు.

స్థూల పన్ను ఆదాయంలో రాష్ట్రాల వాటా తక్కువగా ఉన్నదని పేర్కొన్నారు. సంక్షేమ కార్యక్రమాలను బలోపేతం చేయడం మౌలిక సదుపాయాల కల్పన ద్వారా అంతరాలను పరిష్కరించడానికి అవకాశం ఉందన్నారు. ఇది తెలంగాణ డిమాండ్ కాదని.. అన్ని రాష్ట్రాలకు సంబంధించినదని పేర్కొన్నారు.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రమని... చారిత్రిక కారణాల వల్ల అసమాన అభివృద్ధి ఇక్కడ ఉన్నదని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. తలసరి ఆదాయం ఎక్కువ ఉన్నప్పటికీ సంపద, ఆదాయం మధ్య పెద్ద అంతరం ఉందని వెల్లడించారు. ఇలాంటి అసమానతల మూలంగానే రాష్ట్ర సాధన ఉద్యమం ప్రారంభమైందన్నారు. సమానతల పరిష్కారానికి మౌలిక సదుపాయాలు, సంక్షేమ రంగంపై గణనీయంగా ఖర్చు చేయాల్సి ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు.

# సంపాదకీయం

## ఉక్రెయిన్-రష్యా మధ్యలో చమురు దీపం
## మోదీ వెళ్లింది ఇందుకే!

ఉక్రెయిన్-రష్యా యుద్ధం మొదలై రెండున్నరేళ్లు.. అమెరికా సహా పశ్చిమ దేశాలన్నీ మొదటినుంచి ఉక్రెయిన్ వైపు నిలిచాయి. రష్యా పక్షాన చైనా, ఉత్తర కొరియా, ఇరాన్ మాత్రమే ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో భారత్ ఎటువైపు? దీనిపై తీవ్ర ఒత్తిడి వచ్చింది. అయితే, దశాబ్దాలుగా మనకు రష్యా మిత్ర దేశం. అమెరికా మనల్ని శత్రువుగా చూసిన రోజుల్లోనే రష్యా సాయం చేసింది. ఇంకోవైపు ఉక్రెయిన్ అటు మిత్ర దేశం కాదు. అలాగని విభేదాలూ లేవు. మన విద్యార్థులు వేల సంఖ్యలో ఆ దేశంలో చదువుతున్నారు. నూనెలు సహా ఇతర దిగుమతులు ఆ దేశం నుంచే ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఉక్రెయిన్ కు వ్యతిరేకంగా మాట్లాడలేని పరిస్థితి.

**మధ్యవర్తిత్వం ఎందుకో?...** ఉక్రెయిన్-రష్యా యుద్ధం మొదలైన తొలి రోజుల్లోనే మోదీ తాను మధ్యవర్తిత్వానికి సిద్ధం అని ప్రకటించారు. కాకపోతే ఆ వేడిలో ఎవరూ పట్టించుకోలేదు. తాజాగా రష్యా-ఉక్రెయిన్ లలో పర్యటించి శాంతి సందేశం ఇచ్చారు. పైకి మోదీ శాంతి ప్రయత్నాలే కనిపిస్తున్నా.. వెనుక చాలా వ్యూహమే ఉంది. కాగా, రష్యా నుంచి యూరప్ దేశాలు చాలావాటికి ఇంధనం సరఫరా అవుతుంటుంది. ఆ దేశం ఉక్రెయిన్ పై యుద్ధానికి దిగిన తొలి రోజుల్లో యూరప్ దేశాలు తీవ్ర ఆందోళనకు గురయ్యాయి. ఇప్పుడు భారత్ కూడా అదే పరిస్థితుల్లో ఉంది. భారత ఆర్థిక వ్యవస్థకు కీలకమైన చమురు దిగుమతులకు ఉక్రెయిన్-రష్యా యుద్ధానికి ముగింపు అత్యవసరం. అందుకే మోదీ చొరవచూపారని సమాచారం. ఓవైపు మోదీ వచ్చాక భారత్ లో చమురు ధరలు రెట్టింపు అయిన వైనాన్ని ప్రతిపక్షాలు దెప్పిపొడుస్తున్నాయి. ఇలాంటి సమయంలో ఇంకా ధరలు పెరిగితే అది ఇబ్బందికర పరిస్థితికి దారితీస్తుంది. అందుకే ధరలను స్థిరంగా ఉంచేందుకు ఉక్రెయిన్-రష్యాలకు సమ దూరం పాటించారు మోదీ. తద్వారా చమురు రవాణా చైన్ దెబ్బతినకుండా చూశారు.

**రష్యాతో పెట్టుకుంటే చమురు వదులుద్ది...** ఉక్రెయిన్ పై రష్యా దండయాత్రతో ఆఫ్రికా దేశాలకు అత్యంత ముఖ్యమైన గోధుమల సరఫరా నిలిచిపోయింది. దీంతో మానవతా కోణంలో వాటిని ఎగుమతి చేసేందుకు రష్యా అంగీకరించింది. ప్రపంచ వాణిజ్యంపై, ముఖ్యంగా చమురు, గ్యాస్, గోధుమలు, ఎరువుల సరఫరాపై కూడా ప్రతికూల ప్రభావం పడింది. ఎందుకంటే ప్రపంచంలో అతిపెద్ద చమురు ఉత్పత్తిదారుల్లో రష్యా ఒకటి. కానీ, పాశ్చాత్య దేశాలు ఆంక్షలు విధించడంతో, ప్రపంచ చమురు సరఫరా దుర్లభమైంది. రష్యా చమురు లేకుంటే దీపం వెలగని పరిస్థితి యూరప్ దేశాలది. దీంతో అవి ప్రత్యామ్నాయాల కోసం ప్రయత్నాలు మొదలుపెట్టాయి. మరి భారత్ ముడి చమురులో దాదాపు 80 శాతం దిగుమతి చేసుకునే దేశం. ఇలాంటి పరిస్థితుల్లో ఉక్రెయిన్-రష్యా యుద్ధం మనకు మరింత ఇబ్బందికరం అయ్యేది. కానీ, మోదీ విధానంతో నేర్పుగా ఎదుర్కొంటోంది. ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు పెరిగినప్పుడు ఆ ప్రభావాన్ని తగ్గించేందుకు రాయితీతో రష్యా చమురు పొందింది భారత్. దౌత్య మార్గాలతో పశ్చిమ దేశాలతో సంబంధాలు చెడకుండా చూసుకుంది.

## క్రీడాకారులు ఉత్తమ లక్ష్యాలను ఎన్నుకొని ఉత్తమ క్రమశిక్షణతో ముందుకు వెళ్లగలిగితే విజయాలను అందుకోగలరు

### మేడ్చల్ జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కూరపాటి రాజశేఖర్



శామీర్పేట (గరుడ వార్త): స్థానిక తెలంగాణ క్రీడ పాఠశాలలో భాగంగా నిర్వహించినటువంటి మేడ్చల్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్ పోటీల ముగింపు కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడారు... విద్యార్థులు ఉత్తమ లక్ష్యాలను ఎన్నుకొని క్రమశిక్షణతో ఉపాధ్యాయుల సూచనలతో క్రీడలలో ముందుకు సగ గలిగితే ఎనలేని విజయాలను సొంతం చేసుకోగలరని అన్నారు. అదేవిధంగా క్రీడలు శారీరక మానసిక ఉల్లాసానికి ఎంతో తోడ్పాటు అందిస్తాయని తెలిపారు. ముందు ముందు క్రీడలకు సముచిత స్థానం ఉందని మేడ్చల్ జివిస్టి సెక్రెటరీ రాజశేఖర్ తెలిపారు. క్రీడలు శారీరక ఉల్లాసం తో పాటు మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహద పడతాయన్నారు. తెలంగాణ పారావోలంపియన్ ప్రీతి పాల్400 మీటర్ల విజేత ను తెలంగాణ క్రీడాకారులు ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని ఆకాంక్షించారు. క్రీడాకారులకు మంచి భవిష్యత్తు ఉంటుందని, క్రీడలకు ఎంతో ప్రాధాన్యతిస్తున్న తెలంగాణ ప్రభుత్వాన్ని అభినందించారు. విజేతలైన విద్యార్థులకు మెడల్స్ ప్రశంస పత్రాలతో అభినందించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు క్రీడా ప్రాంగణము ఆవురా అనిపించింది. ముగింపు కార్యక్రమంలో మేడ్చల్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ టెక్నికల్ కమిటీ చైర్మన్ ఓ అశోక్, జాయింట్ సెక్రెటరీ రాజు, ప్రభుదాస్, దయాల్, భాస్కర్ రెడ్డి, శేఖర్, సురేందర్, ప్రశాంత్, సునీల్, తెలంగాణ క్రీడా పాఠశాల కోచ్ గోపాల్, హర్ష, మణికంఠ, రంగారెడ్డి డిస్ట్రిక్ట్ కోచ్ సాయి రెడ్డి తదితరులు పాల్గొని క్రీడాకారులకు బహుమతులు అందజేశారు

## అల్వాల్ లక్ష్మీ ఎంక్లేవ్ లో ఏర్పాటు చేసిన గణపయ్యను దర్శించుకున్న..

### సీఐ రాహుల్ దేవ్, డిఐ రాజేంద



అల్వాల్ (గరుడ వార్త) : అల్వాల్ లోని వాడ వాడలా ఘనంగా గణపయ్య పూజలు అందుకుంటున్నాడు. అల్వాల్ లోని లక్ష్మీ ఎంక్లేవ్ లో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని అల్వాల్ సీఐ రాహుల్ దేవ్ డిఐ రాజేంద దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష్మీ ఎంక్లేవ్ ప్రెసిడెంట్ రాజేష్, జనరల్ సెక్రెటరీ శ్రీనివాస్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి పోలీస్ అధికారులకు స్వాగతం పలికి, వారితో పాటు ప్రత్యేక పూజలు పాల్గొన్నారు.

## గణేష్ నిమజ్జనాలు సజావుగా సాగేలా చర్యలు చేపట్టండి... మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ గౌతం

### శామీర్ పేట పెద్ద చెరువు వద్ద గణేష్ నిమజ్జనాల ఏర్పాట్లపై సూచనలు...



శామీర్ పేట, (గరుడ వార్త) : గణేష్ నిమజ్జనాలలో ఎటువంటి లోటుపాట్లకు తావివ్వకుండా సజావుగా సాగేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ గౌతమ్ పోట్రు అధికారులను ఆదేశించారు. మంగళవారం శామీర్ పేట పెద్ద చెరువు వద్ద ఏర్పాటుచేసిన నిమజ్జనాల ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ గౌతం పోట్రు మేడ్చల్ డిసిపి కోటిరెడ్డి తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గణేష్ నిమజ్జనాల్లో ఉత్సవాల ఆర్గనైజర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. నిమజ్జనాలకు విచ్చేసే భక్తులకు అవసరమైన ఏర్పాట్లను బాధ్యతగా పూర్తి చేయాలని సంబందిత అధికారులకు, పోలీసులకు తెలిపారు. చెరువులో గణపతి విగ్రహాలను నిమజ్జనం చే సేం దుకు రాత్రి పూట వచ్చే ఉత్సవాల అర్గనైజర్లు ప్రమాదాలకు గురికాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన భద్రతా చర్యలను పటిష్టంగా ఉండేలా చూడాలని కలెక్టర్ మేడ్చల్ జోన్ డీసీపీ కోటిరెడ్డి, ఏసీపీ రాములు, శామీర్ పేట ఇన్స్పెక్టర్ శ్రీనాథ్ లకు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో తూంకుంట మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్, శామీర్ పేట తహాశీల్దార్ యాదగిరిరెడ్డి, ఎంపీడీఓ మమతాబాయి, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖ అధికారులు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఘనంగా అన్న ప్రసాద వితరణ

శామీర్ పేట, (గరుడ వార్త) : శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఘనంగా అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రం శామీర్ పేట లోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద శామీర్ పేట కు చెందిన బత్తిని ఈశ్వర్ గౌడ్ జ్ఞాపకార్థం





వారి కుటుంబ సభ్యులు, బత్తిని కృష్ణ గౌడ్ మనుమడు శివ గౌడ్ జన్మదినం సందర్భంగా వారి కుటుంబ సభ్యులు, శామీర్ పేట గౌడ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. వివిధ గ్రామాల భక్తులు, మాజీ ప్రజా ప్రతినిధులు, రాజీవ్ రహదారి పై వెళ్లే భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.

## తెలంగాణ వీరనారిఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి..

శామీర్ పేట, (గరుడ వార్త) : తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మనని, తాను చేసిన పోరాటం రాష్ట్రం ఎన్నటికీ మరువబోదని మునిసిపల్ చైర్మన్ రాజేశ్వరరావు అన్నారు. మంగళవారం శామీర్ పేట మండలం తుంకుంట మున్సిపల్ పరిధిలోని సింగయపల్లిలో చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారిణి, వీరవనిత చాకలి ఐలమ్మ పోరాటపట్టిమను మరువలేమని, ఆమె చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భీమిడి జైపాల్ రెడ్డ, మున్సిపల్ 8 వ వార్డు కౌన్సిలర్ కోమటిపల్లి సురేష్, సింగాయిపల్లి, హకీంపేట్ రజక సంఘం అధ్యక్షులు డి శంకర్, నాయకులు వలందాస్ మురళి గౌడ్, మహమ్మద్ జాఫర్, తలగామ జగన్, నక్క మల్లేష్ గౌడ్, గణపుర్ కృష్ణ, జే నాగేశ్వర్ రావు, జే సురేష్, కే శ్రీనివాస్, ఎ రాఘవేందర్, కే శివన్న యమ్ శశి పాల్గొన్నారు.



## శామీర్ పేట గ్రామపంచాయతీ తుంకుంట మున్సిపాలిటీలో విలీనం

శామీర్ పేట, (గరుడ వార్త ): రాష్ట్ర ప్రభుత్వ ఆ దేశాల అనుసారం మంగళవారం శామీర్ పేట గ్రామ పంచాయితీ కార్యాలయంలోని సిడిఎంఏ అసిస్టెంట్ డైరెక్టర్, స్పెషల్ ఆఫీసర్ జ్యోత్స్న ఆధ్వర్యంలో రికార్డులు సీజ్ చేసుకొని చార్జి తీసుకున్నారు. శామీర్ పేట, బాబాగూడా, బొమ్మ రాసి పేట గ్రామాలను మున్సిపల్ లో విలీనం చేసుకొని ఆయా పంచాయతీలకు చెందిన రికార్డులను సీజ్ చేసి పరిశీలిస్తున్నారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ జ్యోత్స్న, మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాలు మాట్లాడుతూ ప్రజలకు సుపరిపాలన అందిస్తామని, నేటి నుంచి తుంకుంట మున్సిపల్ ఆధ్వర్యంలో ఈ ప్రాంతాల అభివృద్ధి





కొనసాగుతుందని చెప్పారు. ఆయా గ్రామాల ప్రజలు విలీనంపై భయాందోళన చెందవద్దని తెలిపారు. కార్యక్రమములో శామీర్ పేట ఎంపీడీఓ మమత బాయి ఎంపీవో వినూత్న,పంచాయితీ కార్య దర్శి శ్రీనివాస్ , మున్సిపల్ మేనేజర్ శ్రవణ్ కుమార్, గ్రామ పంచాయితీ మాజీ పాలకవర్గ సభ్యులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ పోరాటం స్ఫూర్తి దాయకం

### ఉట్నూర్‌లో ఐలమ్మ విగ్రహ ఏర్పాటుకు కృషి చేస్తా

### ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్





ఉట్నూర్ : తొలి భూపోరాటానికి నాంది పలికిన ధీరవనిత ఉద్యమ కారిణి చాకలి ఐలమ్మ అని,దొరల పాలనను అంతమొందించడానికి,ఆ మహనీయు రాలు చేసిన పోరాటం మనందరికీ స్ఫూర్తినిస్తోందని ఖానాపూర్ నియో జకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం ఉట్నూరు మండల కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో రజక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ 39వ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్నా రు.ముందుగా ధీరవనిత చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. భూస్వాములకు, దొరలకు వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ నిరంతరం పోరాడారని, ఆ ధీరవనిత పోరాటాన్ని మహిళలు స్ఫూర్తిగా తీసుకోవాల న్నారు.ఆ మహనీయురాలి అడుగు జాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు.త్వరలో ఉట్నూర్ లో చాకలి ఐలమ్మ విగ్రహ ఏర్పాటుకు తన వంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు.రజక సమాజానికి అండగా ఉంటామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సబ్బండ వర్గాల ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తోందన్నారు.ఏ సమస్యలు తన దృష్టికి తీసుకురావాలని,ఆ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు.ఈ సందర్భంగా రజక సంఘం సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో లక్కారాం మాజీ సర్పంచ్ మర్సుకోల తిరుపతి, రజక సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అవినీతిలో పోటాపోటీ

జగిత్యాల: అయిదు, ఆరంకెల జీతమున్నా కొందరు ప్రభుత్వ ఉద్యోగులు బల్ల కింద చేయి చాచి లంచాలకు ఆశ పడుతున్నారు. ఉద్యోగరీత్యా చేయాల్సిన పనికి లంచం ఆశిస్తూ చివరకు అనిశా వలలో చిక్కుతున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నాలుగేళ్లుగా ఏసీబీ అధికారులు అరెస్టు చేసిన ప్రభుత్వ అధికారుల్లో రెవెన్యూ, పోలీసు శాఖలకు చెందిన వారే ఎక్కువగా ఉన్నారు. వీరితో పాటు 13 శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది అవినీతి మరకలు అంటించుకున్నారు. క్షేత్రస్థాయిలో అవినీతి జాడ్యం విపరీతంగా పెరిగిపోయి చాలా 'చేపలు' వలకు చిక్కకుండా తమ పని కానిచ్చేస్తున్నాయి. ఈ ఏడాది ఇప్పటికే 8 కేసులు నమోదు కాగా 15 మందిని ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు.

ముందు వరుసలో రెవెన్యూ, పోలీస్

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నమోదైన కేసులను పరిశీలిస్తే రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులు, సిబ్బంది అవినీతిలో మొదటి, రెండో స్థానాల్లో నిలిచారు. 2021 నుంచి 2024 ఆగస్టు వరకు రెవెన్యూ శాఖలో 8 కేసులు నమోదు కాగా 16 మందిని ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. పోలీసు శాఖలో ఈ నాలుగేళ్లలో 7 కేసులు నమోదు కాగా 10 మందిని అరెస్టు చేశారు. 6 కేసులు, ఏడుగురి అరెస్టుతో పంచాయతీరాజ్ శాఖ మూడో స్థానంలో నిలిచింది. పురపాలక శాఖ 4, రిజిస్ట్రేషన్ శాఖ 2, విద్యుత్తు, తూనికలు–కొలతలు, సర్వే, వైద్య–ఆరోగ్య, మార్కెటింగ్, మత్స్య, టౌన్ ప్లానింగ్, పరిశ్రమల శాఖల్లో ఒక్కో కేసు చొప్పున నమోదైంది. నాలుగేళ్లలో అన్ని శాఖల్లో కలిపి 35 కేసుల్లో 56 మందిని నిరోధక శాఖ అధికారులు అరెస్టు చేశారు.

శిక్షలతో దడదడ



అవినీతి ఆరోపణల్లో అరెస్టయిన వారికి న్యాయస్థానాలు జైలు శిక్ష, జరిమానాలు విధిస్తుండటంతో లంచగొండి అధికారులు భయపడుతున్నారు. 2022లో వీఆర్వో జూపాక మొగిలికి రెండేళ్ల జైలుశిక్ష, 2023లో వీఆర్వోలు మధుసూదన్ రావు, రాంచందర్ రావు, వెంకట రమణ, శ్రీనివాస్‌కు నాలుగేళ్ల పాటు జైలు శిక్ష, రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు జరిమానా విధిస్తూ తీర్పులు వెలువడ్డాయి. 2024లో ఫిబ్రవరి 9న వీఆర్వో ఎల్.శ్రీనివాస్‌కు నాలుగేళ్ల జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధించగా మే 23న సీనియర్ అసిస్టెంట్ ప్రణవేందర్‌కు నాలుగేళ్ల జైలుశిక్ష, రూ.6 వేల జరిమానా విధించారు.

ముందే సమాచారమిస్తే ఫలితం

లంచం ఇవ్వనిదే పనికాదనే అనుమానం ఉంటే బాధితులు ముందుగానే మాకు సమాచారమిస్తే తొలి ప్రయత్నంలోనే అరెస్టు చేస్తాం. అధికారులు, సిబ్బంది లంచం తీసుకుంటే వాళ్లను జైలుకు పంపడమే కాకుండా ఫిర్యాదుదారులు ఏ పని మీద ప్రభుత్వ కార్యాలయానికి వచ్చారో ఆ పని ఇతర అధికారులతో పూర్తి చేయిస్తాం. అధికారులకు లంచంగా ఇచ్చిన డబ్బు 2 నెలల లోపు ఫిర్యాదుదారులకు తిరిగి వస్తుంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన వారు లంచగొండి అధికారుల గురించి సమాచారమివ్వాలనుకుంటే టోల్‌ఫ్రీ నంబరులో, నేరుగా గానీ ఫిర్యాదు చేయవచ్చు. అక్రమ ఆస్తుల వివరాలు చెప్పిన వారి వివరాలు గోప్యంగా ఉంచి తదుపరి చర్యలు తీసుకుంటాం. అవినీతి కేసుల్లో శిక్షలు కూడా పడుతున్న విషయాన్ని గుర్తించి ప్రజలు మా సేవలను వినియోగించుకుంటే బాగుంటుంది. వి.వి.రమణ, డీఎస్పీ, అనిశా


# వర్షం.. హలధారి హర్షం

మెదక్: పల్లెల్లో వరి పైర్ల పచ్చదనం.. మత్తడి దూకుతున్న చెరువులను చూసి మెతుకు సీమ అన్నదాతలు మురిసిపోతున్నారు. వానాకాలం ఆరంభంలో వర్షాలు లేక కర్షకులు ఇబ్బందులు పడ్డారు. అనంతరం అల్పపీడన ప్రభావంతో లోటు వర్షపాతం తొలగిపోయి సాధారణం కంటే మించి నమోదైంది. ఇక పంటల సాగు ఢోకా లేకుండా పోయింది. చెరువులు, కుంటల్లో నీళ్లు సమృద్ధిగా ఉండడంతో భూగర్భజలాలు పెరగనున్నాయి.

చెరువులకు జలకళ

జిల్లాలో 2,694 నీటి వనరులు ఉన్నాయి. ఇప్పటి వరకు అత్యధిక శాతం చెరువులు నిండాయి. కొద్దిరోజుల కిందట చెరువుల్లో నీళ్లు లేక రైతులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. గత నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అలుగుపారుతున్నాయి. భారీ నుంచి అతి భారీ వర్షాలు కురవడంతో చెరువుల్లోకి నీళ్లు వచ్చి చేరాయి. 105 చెక్ డ్యాంలకు గాను 29 పొంగిపొర్లుతున్నాయి. సింగూర్ ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయడంతో దిగువన ఉన్న ఘనపూర్ ఆనకట్టకు పెద్దఎత్తున నీళ్లు వచ్చి చేరుతున్నాయి.

బోర్ల కింద:జిల్లాలో అధికంగా సేద్యమే జీవనాధారం. రెండు ప్రాజెక్టులున్నా, బోర్ల కింద అధిక శాతం సాగుచేస్తారు. ప్రస్తుత



వానాకాలంలో ఆలస్యంగా వర్షాలు కురవడంతో చాలా మంది బోర్లపై ఆధారపడి పంటలను సాగు చేశారు. జిల్లాలో ఇప్పటి వరకు అన్ని రకాల పంటలు కలిపి 3.19 లక్షల ఎకరాల్లో సాగు కాగా, అందులో 2.46 లక్షల ఎకరాల్లో వరి, 35,134 ఎకరాల్లో పత్తి, 2,261 ఎకరాల్లో మొక్కజొన్న వేశారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా గతేడాది కంటే ఈసారి వరి సాగు తగ్గుముఖం పట్టింది. జిల్లాలో జూన్ 1నుంచి ఈనెల 6వరకు 565.7 మి.మీల వర్షం కురవాల్సి ఉండగా, 770.6 మి.మీల వర్షం కురిసింది. సాధారణం కంటే 36.2 మి.మీల వర్షపాతం నమోదైంది. 21 మండలాలకు గాను నాలుగు మండలాలు మినహా మిగిలిన 17 మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదైంది. మాసాయిపేట మండలంలో అత్యధిక వర్షపాతం నమోదైంది. హవేలిఘనపూర్, మనోహరాబాద్, కౌడిపల్లి, నర్సాపూర్ మండలాల్లో మాత్రం ఇంకా సాధారణ వర్షపాతం నమోదైంది.

# యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు



రాయికల్ : రాయికల్ బల్దియా పరిధిలో అక్రమ నిర్మాణాల జోరు కొనసాగుతోంది. తెలంగాణ రాష్ట్ర భవన నిర్మాణ అనుమతి, స్వీయ ధ్రువీకరణ విధానం(టీఎస్ బీపాస్) చట్టం రాయికల్ పట్టణ పరిధిలో నీరుగారిపోతుంది. చట్టంలోని లొసుగులు, నిర్మాణదారుల అవసరాలు ఆసరాగా చేసుకొని నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న భవన నిర్మాణాలు అవినీతి అధికారులు, కొందరు ప్రజాప్రతినిధులకు కాసులు కురిపిస్తున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. పట్టణంలో పలు చోట్ల నిబంధనలు పాటించకుండా, సెట్‌బ్యాక్‌లు లేకుండా భవన నిర్మాణాలు చేపడుతున్నారు. మరో నాలుగు నెలల్లో పుర పాలకవర్గం పదవీకాలం ముగియనుండటంతో అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు వస్తున్నా ప్రజాప్రతినిధులు పట్టించుకోకుండా సహకరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

**ఇవీ అక్రమాలు**

పట్టణంలో ప్రధాన రహదారులు, పలు వార్డుల్లో పదుల సంఖ్యలో అనుమతులు లేకుండానే నిర్మాణాలు జరుగుతున్నాయి. వీటికి పాత ఇంటి నంబర్ ఉంటే రూ.80 వేలు, నూతనంగా ఇంటి నంబర్ కేటాయించి అక్రమ నిర్మాణాలకు సహకరిస్తే రూ.1.2 లక్షలు ధర చెల్లించాలని బాహాటంగానే కోరుతున్నారు.

రహదారులు 12 నుంచి 15 అడుగులు ఉన్నా పాత నిర్మాణాలు తొలగించి సెట్‌బ్యాక్ లేకుండా, ఒకవేళ ఉన్నా నామమాత్రంగా చేస్తూ స్లాబ్‌లను పెంచి నిర్మాణాలు చేస్తున్నా మామూలుగా తీసుకుంటున్నారు. రాయికల్ బల్దియా పరిధిలో పారిశుద్ధ్య కార్మికులకు నిధుల లేమితో వేతనాలు సకాలంలో చెల్లించక పోగా నిర్మాణాల ద్వారా ఆదాయం సమకూరే అవకాశం ఉన్నా కొందరు ప్రజాప్రతినిధులు, అధికారుల అవినీతి కారణంగా బల్దియాకు భారీగా ఆదాయం గండిపడుతోంది.

నిబంధనలు

కొత్తగా భవన నిర్మాణాలు చేపడితే భవిష్యత్తు అవసరాలు దృష్టిలో ఉంచుకొని లోపలికి జరిగి ఇళ్ల నిర్మాణం చేసుకోవాలి. టీఎస్ బీపాస్‌ను అనుసరించి 100 మీటర్ల నిర్మాణానికి నాలుగు దిక్కుల్లో మీటరు స్థలం వదలాలి. 200 నుంచి 300 మీటర్ల స్థలంలో అయితే జీప్లస్ 3 అంతస్తులు కట్టుకోవచ్చు. 30 అడుగుల వెడల్పు రహదారి తప్పనిసరి. ఈ రోడ్డు వారగా నిర్మాణానికి అయిదడుగులు వెనక్కి జరిగి నిర్మించాలి. 100 అడుగుల రోడ్డు ఉంటే 10 అడుగులు సెట్‌బ్యాక్ వదలాలి. 500 మీటర్ల స్థలం కంటే ఎక్కువ ఉంటేనే సెల్లార్ కట్టాలి. సెట్‌బ్యాక్ స్థలంలో స్లాబ్‌లు, ప్రహరీ, సెప్టిక్ ట్యాంకు నిర్మించరాదు. ఫిర్యాదు చేస్తే తప్ప అధికారులు స్పందించని పరిస్థితి మారాలి. ఉన్నతాధికారులు స్పందించి రాయికల్ బల్దియా పరిధిలో చోటుచేసుకుంటున్న అవినీతి, అక్రమాలు, అనుమతి లేకుండా జరుగుతున్న భవన నిర్మాణాలపై కఠినంగా వ్యవహరించాలని స్థానికులు కోరుతున్నారు.

# నిధులు చాలక.. నిర్మాణాలు సాగక



గంభీరావుపేట: ఆట పాటలతో సాగే అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు లేక చిన్నారులు, బాలింతలు, గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారు. నిధులు చాలక ఏళ్ల తరబడి నిర్మాణం మధ్యలో ఆగిపోయాయి. దీంతో అద్దె భవనాలు, పాఠశాలల్లో అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. లబ్ధిదారులు అవస్థలు పడుతున్నా పట్టించుకున్న నాథుడు లేడు.

జిల్లాలో సిరిసిల్ల, వేములవాడలో రెండు ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. మొత్తం అంగన్‌వాడీ కేంద్రాలు 587 ఉన్నాయి. ఇందులో 51 అంగన్‌వాడీ కేంద్రాల భవన నిర్మాణాలు మధ్యలో నిలిచిపోయాయి. రెండింటికి మిగులు పనులకు నిధులు మంజూరు కాగా పనులు చేస్తున్నారు. ఇంకా 49 భవనాలు అసంపూర్తిగానే దర్శనమిస్తున్నాయి. కొన్ని భవనాలు స్లాబ్ దశలో, మరికొన్ని ప్లాస్టరింగ్, బెడ్, విద్యుత్తు పనులు చేయాల్సి ఉంది. కొన్ని కేంద్రాలకు ఒకసారి నిధులు మంజూరు కాగా, కొన్నింటికి రెండు సార్లు విడుదల చేసినా చాలక మధ్యలో ఆగిపోయాయి. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి నిధులు మంజూరు చేసి భవనాల పూర్తికి చర్యలు చేపట్టాలని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఇవీ ఇబ్బందులు

అద్దె భవనాలు, పాఠశాల భవనాల్లో నిర్వహిస్తుండటంతో పూర్తి స్థాయిలో వసతులు లేక చిన్నారులు అవస్థలు పడుతున్నారు.

సరైన వెలుతురు లేకపోవటం, గదులు చిన్నవిగా ఉండటంతో చిన్నారులు ఆడుకోవడానికి వీల్లేకుండా ఉంది.

కేంద్రాలకు వచ్చే బాలింతలు, గర్భిణులకు అనుకూలంగా భవనాలు లేక ఇబ్బందులు పడుతున్నారు.

అద్దె భవనాల్లో మూత్రశాలలు లేకపోవడంతో తిప్పలు తప్పడం లేదు.

ఈ చిత్రంలో కనిపిస్తున్న గంభీరావుపేట మండలంలోని నర్మాల క్యాంపులోని అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణానికి 2015 సంవత్సరంలో రూ.4 లక్షలు మంజూరయ్యాయి. 2018లో మరో రూ.3 లక్షలు విడుదల చేశారు. వీటితో 80 శాతం పనులు పూర్తయ్యాయి. తలుపులు, కిటికీలు, విద్యుత్తు తదితర పనులు మిగిలిపోయాయి. ప్రస్తుతం ఇక్కడి అంగన్‌వాడీ కేంద్రం రెండు పడక గదుల ఇంట్లో నిర్వహిస్తున్నారు.

త్వరగా పూర్తి చేయాలి

మండలంలోని ముస్తఫనగర్‌లో పక్కా భవనం నిర్మాణంలో ఆగిపోయింది. కేవలం స్లాబ్ వరకు మాత్రమే పనులు చేశారు. దాదాపు పది సంవత్సరాలు అవుతుంది. అద్దె భవనంలో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే పూర్తి చేసి సమస్యలను తీర్చాలి. బండ కస్తూరి, అంగన్‌వాడీ చిన్నారి తల్లి, ముస్తఫనగర్

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

జిల్లాలో 51 భవనాలు నిర్మాణం మధ్యలో ఆగిపోయిన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కేవలం రెండు భవనాలకు నిధులు మంజూరు చేశారు. వాటి పనులు కొనసాగుతున్నాయి. దశల వారీగా నిధులు మంజూరు చేసి, అసంపూర్తిగా ఉన్న వాటిని కూడా పూర్తి చేస్తాం. లక్ష్మీరాజం, జిల్లా సంక్షేమ అధికారి

# మిద్దెపై పంట.. ఇంట్లో వంట

సూర్యాపేట : సూర్యాపేట పురపాలికలో మిద్దె సాగుపై ప్రజలు దృష్టి సారిస్తున్నారు. ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని తమ ఇళ్లపై వివిధ కూరగాయలు సాగు చేస్తున్నారు. రెండేళ్లలో సూర్యాపేట పట్టణంలో 1,130 మందికి పైగా తమ ఇళ్లపై కూరగాయలు పండిస్తున్నారు. పెరుగుతున్న ధరలు, ఆరోగ్య సమస్యల కారణంగా ప్రజలు సొంతంగా కూరగాయలు పండించి తింటున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని సూర్యాపేట పురపాలికలో అధికంగా ఉండగా.. మిగతా పురపాలికల్లో అడపాదడపా సాగు చేస్తున్నారు. దీనిపై పుర అధికారులు కూడా అవగాహన కల్పిస్తున్నారు. దీంతో పాటుగా రూ.1500 చెల్లిస్తే రాయితీపై రూ.10 వేల విలువైన పరికరాలు అందజేస్తున్నారు. కూరగాయలు సాగు చేపట్టేందుకు బ్యాగులు, ఎరువులు అందించి ముందుకు సాగుతున్నారు. దీంతో పట్టణంలోని మహిళలతో పాటు పురుషులు మిద్దెసాగుకు ముందుకొస్తున్నారు.

విధులకు వెళ్తూ..సూర్యాపేట పట్టణంలోని తిరుమలనగర్‌కు చెందిన రాము ప్రభుత్వ ఉపాధ్యాయుడు. విధులు నిర్వర్తిస్తూనే మిద్దెపంటపై మక్కువతో సాగు చేపట్టారు. ఆరేళ్ల నుంచి ఇంటిపై వివిధ రకాల కూరగాయలను రసాయన మందులు వినియోగించకుండా పండిస్తున్నారు. పాఠశాలకు వెళ్లి వచ్చిన తర్వాత నీటిని



అందించటంతోపాటు వాటికి కావాల్సిన ఎరువులు అందిస్తారు. మిద్దె తోట వల్ల పురుగు మందులేని కూరగాయలు తినొచ్చని రాము చెబుతున్నారు. ఉన్న కొద్దిపాటి ఇళ్లపై టెర్రస్లో, ఆర్గానిక్ కూరగాయలు పండించుకోవచ్చని సూచించారు.

కూరగాయల రకాలుమిద్దెపై బెండ, కాకర, బీర, సొర, గుమ్మడి, దొండ, వంకాయ, చిక్కుడు, గోకర, కాయగూరలు, పాలకూర, తోటకూర, పొన్నగంటి కూర, గోంగూర, బచ్చలికూర, పుదీనా, కొత్తిమీర, టమాట, పచ్చిమిర్చి, ఉసిరి, మామిడి, జామ, నిమ్మ, యాపిల్‌బేర్, దానిమ్మ వంటి రకాలు నాటారు.

# ప్రణాళిక మారింది..!

నల్గొండ : పంచాయతీ సర్పంచుల పాలకవర్గం గడువు ఈ ఏడాది ఫిబ్రవరిలో ముగిసింది. ఈ మేరకు పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా తయారీలో సిబ్బంది నిమగ్నమయ్యారు. ఈ నెల 6న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటించాల్సి ఉండగా.. తాజాగా షెడ్యూల్ మారుస్తూ ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది.

ఇప్పటికే మొదలైన సంప్రదింపులు..

పంచాయతీ ఎన్నికల అంశం తెరపైకి రావడంతో ఇప్పటికే స్థానిక నేతల్లో జోష్ వచ్చింది. ప్రభుత్వం రిజర్వేషన్లకు సంబంధించి ఇంకా స్పష్టమైన నిర్ణయం తీసుకోలేదు. పాత రిజర్వేషన్లను అలాగే కొనసాగిస్తారా? లేదా? అనేది తెలియక అయోమయానికి గురవుతున్నారు. తమకు అనుకూలమైన రిజర్వేషన్ వస్తే పోటీ చేసేందుకు ఇప్పటినుంచే జిల్లాస్థాయి నాయకులతో సంప్రదింపులు చేస్తున్నారు.

సిబ్బంది ఎంపిక..గతంలో మాదిరి ఈసారి కూడా పంచాయతీ ఎన్నికలు మూడు దశల్లో నిర్వహించనున్నారు. రెవెన్యూ డివిజన్ల వారీగా ఎన్నికలు జరుపనున్నారు. ఇందుకు అవసరమైన బ్యాలెట్ పెట్టెలు ఇప్పటికే సమకూర్చారు. ఎన్నికల విధులు నిర్వహించేందుకు సిబ్బందిని తీసుకుంటున్నారు. ప్రభుత్వ శాఖల నుంచి ఎన్నికల విధులకు అధికారులను, సిబ్బందిని ఎంపిక చేసేందుకు ఆయా శాఖల నుంచి



ఉద్యోగుల, అధికారుల వివరాలు సేకరించే ప్రక్రియ ప్రారంభించారు. వీరిలో వారి హోదాను అనుసరించి ఎన్నికల విధులు అప్పగించనున్నారు. వీరికి త్వరలోనే శిక్షణ ఇవ్వనున్నారు.

28న తుది జాబితా..మారిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 13వ తేదీన ఓటర్ల ముసాయిదా ప్రకటిస్తారు. 14వ తేదీ నుంచి 21 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. 18న జిల్లా స్థాయిలో, 19న మండల స్థాయిలో ఎంపీడీవోలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి సందేహాలు, అభ్యంతరాలపై చర్చిస్తారు.

26న జిల్లా పంచాయతీ అధికారులు అభ్యంతరాలపై తుది నిర్ణయం తీసుకుంటారు. 28న వార్డుల వారీగా ఓటరు తుది జాబితాను ప్రకటిస్తారు. ఒక వార్డులో 650 మంది ఓటర్లు ఉండే విధంగా తయారు చేస్తున్నారు. అంతకంటే ఎక్కువ ఓటర్లు ఉంటే అదనంగా పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు ఒక పోలింగ్ కేంద్రంలో ఉండేలా జాబితా రూపొందిస్తున్నారు.

జిల్లాలో ఎన్నికలు జరిగే పంచాయతీలు

నల్గొండ 868 సూర్యాపేట 486యాదాద్రి 428

# కాలువలు లేకుండానే పొలాలకు నీరు

తాంసి : ఆదిలాబాద్ జిల్లాలోని మత్తడివాగు ప్రాజెక్టు కుడి కాలువ నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం 2015లో రూ.5.75 కోట్లు మంజూరు చేసింది. తెలంగాణ రాష్ట్రంలోనే తొలిసారిగా మైక్రో ఇరిగేషన్ పద్ధతిలో(పైపులైన్) కాలువ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఎనిమిదేళ్ల కిందట ప్రారంభమైన పనులు ఆగుతూ.. సాగుతూ ఎట్టకేలకు పూర్తయ్యాయి.

కొత్త ప్రయోగం..సాగు నీటి కోసం సాధారణంగా భూసేకరణ చేసి కాలువలు నిర్మిస్తారు. దీని వల్ల ఇటు రైతుల భూములు తీసుకోవడంతో పాటు అటు పరిహారం సమస్య ఏర్పడుతోంది. వీటిని అధిగమించేందుకు అధికారులు కొత్త రకం పద్ధతిని ఎంచుకున్నారు. తాంసి మండలం మత్తడివాగు ప్రాజెక్టు కుడి కాలువ నుంచి దాదాపు 1,243 ఎకరాలకు సాగు నీరందించేందుకు పంట చేలలో తవ్వి భూగర్భంలో పైపులైన్లు వేయించారు. వీటి వల్ల పంటల సాగుకు ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. 9 కిలో మీటర్ల పొడవునా 450 డయా వ్యాసం ఉండే పైపులైన్ వేయగా, మధ్యలో చిన్న పైపులైన్‌ల(డిస్ట్రిబ్యూటరీ లైన్)ను అనుసంధానించారు. ఎత్తిపోతల పథకం మాదిరిగా మత్తడివాగు ప్రాజెక్టు నుంచి నీటిని తీసుకునేందుకు సంప్‌హౌజ్ నిర్మాణం చేపట్టి, అందులో 75 హెచ్‌పీ సామర్థ్యంతో నాలుగు వేర్వేరు మోటార్లను ఏర్పాటు చేశారు. రైతుల భూములకు సాగు నీరందించడానికి 200 చోట్ల అవుట్‌లెట్లు ఏర్పాటు చేశారు. ప్రతి అవుట్‌లెట్ నుంచి ఆరు ఎకరాలకు సాగు నీరందించవచ్చు. ఈ అవుట్‌లెట్ పైపులైన్‌కు ఆనుకొని ఉన్న బాక్సుల్లో ఆటోమెటిక్ వాల్వు ఏర్పాటు చేయించారు. ఇందులో ఉండే సెన్సర్ నీరు రాగానే వాల్వు



తెరుచుకునేలా చేస్తుంది. నీటి సరఫరా ఆగిపోగానే మూసివేస్తుంది. సౌర విద్యుత్తు ఆధారంగా ఇది పని చేసేలా ఏర్పాటు చేశారు. ఎనిమిదేళ్ల కిందట ప్రారంభమైన పనులు ఎట్టకేలకు పూర్తి కావడంతో ఈ ఏడాది ఖరీఫ్ నుంచి సాగు నీటిని విడుదల చేయనున్నట్లు నీటి పారుదల శాఖ డీఈ శ్రీనివాస్ తెలిపారు. ఎన్నో ఏళ్ల కల.. ఎట్టకేలకు నెరవేరుతుండటంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇక రెండు నుంచి మూడు పంటలు పండిస్తామంటున్నారు.

లబ్ధి పొందే గ్రామాలు : తాంసి మండలంలోని హస్నాపూర్, పొన్నారి, వడ్డాడి, తలమడుగు మండలంలోని ఖోడద్, ఆదిలాబాద్ మండలంలోని తరోడ గ్రామం

ప్రత్యేకత : మైక్రో ఇరిగేషన్ పద్ధతిలో పైపులైన్ ద్వారా కాలువ నిర్మాణం

ఆయకట్టు : 1,243 ఎకరాలు

వ్యయం : 5.75 కోట్లు

కాలువ పొడవు : 9 కిలో మీటర్లు

అవుట్‌లెట్లు : 200

ఒక అవుట్‌లెట్ ద్వారా సాగునీరు : 6 ఎకరాలకు

# జలాశయాలకు వరద.. తాగునీటికి భరోసా!

హైదరాబాద్ : మహానగరానికి తాగునీటి భరోసా దక్కింది. ఎగువున కురుస్తున్న వర్షాలతో ప్రధాన జలాశయాల్లోకి వరద చేరుతోంది. కృష్ణా బేసిన్‌లో కురుస్తున్న వానలతో ఆలమట్టి, నారాయణపూర్, జురాల నుంచి శ్రీశైలం జలాశయానికి ప్రస్తుతం 3 లక్షల క్యూసెక్కుల నీళ్లు వస్తున్నాయి. ఈ వరద రోజుకు 29.713 టీఎంసీలకు సమానం. దీంతో ఎడమ, కుడి విద్యుత్తు కేంద్రాల్లో విద్యుత్తు ప్రారంభించడంతో దిగువన ఉన్న నాగార్జునసాగర్‌లోకి 52 వేల క్యూసెక్కుల నీటిని విడిచి పెడుతున్నారు. శ్రీశైలంలోకి ఇదే వరద ఈ నెలాఖరు వరకు కొనసాగితే జలాశయం నీటి మట్టం గరిష్ఠ స్థాయికి చేరుకోనుంది. అక్కడ నుంచి దిగువకు మరింత వరద రానుంది. నాగార్జునసాగర్ పూర్తి నీటి మట్టం 590 అడుగులు కాగా.. ప్రస్తుతం 507 అడుగులకు చేరింది. మరో మూడు అడుగులు పెరిగితే ఎలాంటి అత్యవసర పంపింగ్ లేకుండా గ్రావిటీతో నగరానికి నీటిని తరలించే వెసులుబాటు కలగనుంది. ఈ నేపథ్యంలో జలమండలి అధికారులు అప్రమత్తమయ్యారు. నాగార్జునసాగర్‌లో గత ఏప్రిల్‌లో ఏర్పాటు చేసిన అత్యవసర పంపింగ్ కేంద్రంలోని పరికరాలను తొలగింపు ప్రక్రియ ప్రారంభించారు. రెండు, మూడు రోజుల్లో పూర్తి స్థాయిలో తొలగించనున్నారు. సాగర్‌లో నీటి మట్టం 510 అడుగులకు చేరితే.. అక్కడ నుంచి గ్రావిటీ ద్వారా పుట్టంగండి పంప్‌హౌస్‌కు నీటిని తరలించవచ్చు. ఇప్పటికే ఎల్లంపల్లి(గోదావరి) ప్రాజెక్టులో అత్యవసర పంపింగ్‌ను ఎత్తివేశారు. కడెం నుంచి



11,500 క్యూసెక్కుల వరద ఎల్లంపల్లిలోకి చేరుతోంది. ఈ జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 16.917 టీఎంసీలు వరకు నిల్వ ఉంది. ఇదే వరద కొనసాగితే ఎల్లంపల్లి కూడా పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరుకోనుంది. నగర నీటి అవసరాల్లో కృష్ణా, గోదావరి జలాలే కీలకం. అటు సాగర్ ఇటు ఎల్లంపల్లి రెండు జలాశయాలు పూర్తి మట్టాలకు చేరితే రానున్న రెండేళు నగరానికి నీటిని అందించవచ్చు. మరోవైపు జంట జలాశయాలైన ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌లో ఎగువ ప్రాంతంలో సరైన వానలు లేకపోవడంతో ఈ రెండు జలాశయాల్లోకి ఎలాంటి వరద రావడం లేదు. పరిహాక ప్రాంతంలో విచ్చలవిడిగా ఆక్రమణల వల్ల కూడా వరద నీటికి అడ్డుకట్ట పడుతోంది.

# సంపాదనలో భద్రాద్రి భేష్!

కొత్తగూడెం : వనరులను సమర్థంగా వినియోగించుకుంటూ.. విద్య, వైద్యం, అక్షరాస్యత, వస్తుసేవల రంగాలపై ప్రత్యేక దృష్టి సారిస్తే ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలు రాష్ట్ర రాజధాని చుట్టుపక్కల జిల్లాలతో పోటీపడతాయని రాష్ట్ర సామాజిక, ఆర్థిక నివేదిక-2024 స్పష్టం చేసింది. ఉభయ జిల్లాల్లో స్థూల దేశీయోత్పత్తి, తలసరి ఆదాయం గణనీయంగా పెరిగినా మహిళా విద్య, ఉపాధి కల్పన, నూతన పరిశ్రమల ఏర్పాటు వంటి అంశాల్లో ఆశించిన ప్రగతి కనిపించ టం లేదు. ఈ నేపథ్యంలో సామాజిక, ఆర్థిక సర్వేలో వెల్లడైన అంశాలపై కథనం..2020-21తో పోల్చితే 2022-23లో భద్రాద్రి జిల్లాలో జీడీడీపీరూ. 11,260 కోట్లు పెరిగి రూ.34,215 కోట్లకు చేరింది.ఖమ్మం జిల్లాలో రూ.8,890 కోట్లు పెరిగి రూ.40,802 కోట్లకు జీడీడీపీ చేరుకోవటం గమనార్హం.

ఊతమిస్తే.. మరింత వృద్ధి

జిల్లా స్థూల దేశీయోత్పత్తిలో(జీడీడీపీ) రాష్ట్రంలో వరుసగా ఆరు, ఎనిమిది స్థానాల్లో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం నిలిచాయి. జిల్లాలో ఉత్పత్తి అయిన వస్తుసేవల విలువ ఆధారంగా జీడీడీపీని లెక్కిస్తారు. జీడీడీపీ పెరుగుదలకు ప్రభుత్వం ఊతమిస్తే మెరుగైన స్థానాలను పొందే అవకాశముంది. ముఖ్యంగా పరిశ్రమల ఏర్పాటుకు కావాల్సిన ఖనిజ వనరులు, నీరు, స్థల లభ్యతకు భద్రాద్రి జిల్లా అనుకూలం. వ్యవసాయాధారిత పరిశ్రమల ఏర్పాటుకు ఖమ్మం నిలయంగా ఉంది.

తలసరి ఆదాయం

తలసరి ఆదాయంలో రాష్ట్రస్థాయిలో భద్రాద్రి జిల్లా రూ.2,64,408తో ఎనిమిదో స్థానంలో, ఖమ్మం జిల్లా రూ.2,44,647తో పదో స్థానంలో నిలిచాయి. ఏజెన్సీ ప్రాంతం, అధికంగా మారుమూల గ్రామాలున్నప్పటికీ.. సింగరేణి, కేటీపీఎస్, బీటీపీఎస్, ఐటీసీ వంటి పరిశ్రమల వల్ల వ్యవసాయాధారిత ఖమ్మం జిల్లాతో పోల్చితే భద్రాద్రి జిల్లా వాసుల తలసరి ఆదాయం ఎక్కువ.

ఆడపిల్లలను ఆదిలోనే చిదిమేస్తున్నారు..

ఖమ్మం జిల్లాలో ప్రతి 1,000 మంది మగ శిశువులకు కేవలం 946 మంది, భద్రాద్రి జిల్లాలో 964 మంది ఆడశిశువుల జననాలు మాత్రమే నమోదవుతున్నాయి. మగవారికి అధిక ప్రాధాన్యమివ్వటం, భ్రూణహత్యలు, చట్టవిరుద్ధ లింగ నిర్ధారణ పరీక్షలతో ఈ అంతరం పెరుగుతోంది.

అర్ధాంతరంగా చదువు మానేస్తుండటంతో..

విద్యాప్రమాణాలను పెంచటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నప్పటికీ ఉభయ జిల్లాల్లో చదువు మధ్యలోనే మానేసే విద్యార్థుల సంఖ్య కలవరపరుస్తోంది.భద్రాద్రి జిల్లాలో ప్రతి 100 మంది విద్యార్థుల్లో తొమ్మిదో తరగతి నుంచి పదోతరగతికి వచ్చే వరకు 16.93 మంది చదువు మానేస్తున్నారు. ఖమ్మం జిల్లాలో 4.22శాతం మంది విద్యకు దూరమవుతున్నారు. ఇందులో అత్యధికంగా బాలికలే ఉంటుండటం స్త్రీ సాధికారతకు గొడ్డలిపెట్టుగా తయారవుతోంది.

కలవరపరుస్తున్న గ్రామీణ అక్షరాస్యత

ఖమ్మం జిల్లాలో ప్రతి వంద మందికి 35, భద్రాద్రి జిల్లాలో 34 మంది నిరక్షరాస్యులుగా ఉండటం గమనార్హం. భద్రాద్రి జిల్లాలో గ్రామీణ అక్షరాస్యత 60.38 శాతమవగా.. ఖమ్మంలో 60.86 శాతం ఉంది. పట్టణ అక్షరాస్యతలో ఖమ్మం జిల్లా 83.35 శాతం, భద్రాద్రి 79.31 శాతం కలిగి ఉన్నాయి. ప్రధానంగా గ్రామీణ మహిళల్లో ప్రతి 100 మందిలో కేవలం 52 మంది మాత్రమే చదువుకుంటున్నారు.

పనిచేయని వారే అధికం..

ఒకచోట నివసించే ప్రజలు వివిధ ఆర్థిక కార్యకలాపాల్లో భాగస్వాములైనప్పుడే ఆప్రాంతం సత్వరాభివృద్ధి సాధిస్తుంది. భద్రాద్రి జిల్లాలో 48.36 శాతం, ఖమ్మం జిల్లాలో 50.28 శాతం మంది మాత్రమే ఆర్థిక కార్యకలాపాల్లో పాలుపంచుకుంటున్నారు.

సేవారంగం పరిశ్రమలే ఎక్కువ..ఉభయ జిల్లాల్లో ఎంఎస్ఎంఈ (సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు)లు 46,178 ఉన్నాయి. వీటిల్లో సేవా ఆధారిత పరిశ్రమలే అధికం.

# మరమ్మతు చేపట్టక.. ప్రమాదాలకు నెలవుగా!



మల్లాపూర్: జిల్లాలో మండల, పట్టణ ప్రాంతాలను కలిపే రహదారులతో పాటు జాతీయ, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ రహదారులకు సకాలంలో మరమ్మతు చేపట్టడం లేదు. కోతలకు గురై, గుంతలమయమైన రహదారులపై రాకపోకలకు వాహనదారులు జంకుతున్నారు. గతేడాది కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న రహదారులకు ఏడాది గడుస్తున్నా మరమ్మతు కరవయ్యాయి. కోతలకు గురైన చోట కనీసం హెచ్చరిక బోర్డులను సైతం ఏర్పాటు చేయకపో వడంతో రాత్రివేళ గుంతల్లో పడి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. గతంలో నిర్మించిన ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రహదారులకు ఏళ్ల తరబడి ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడం, మరమ్మతు చేపట్టకపోవడంతో రహదారులు కంకర తేలి అధ్వానంగా మారాయి.

అప్రోచ్ రోడ్డు లేక..

వెల్గటూరు నుంచి జగదేవుపేట వెళ్లే రహదారి ఏళ్ల తరబడి మట్టి రోడ్డుగానే ఉంటోంది. వెల్గటూరు పెద్దవాగుపై వంతెన నిర్మాణం పూర్తయి సుమారు రెండేళ్లు గడుస్తున్నా ఇరువైపులా తారు రోడ్డు నిర్మాణం మాత్రం జరగలేదు. శాఖాపూర్-కొండాపూర్ రోడ్డును ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కింద రూ.2.16 కోట్ల వ్యయంతో 2021 జులైలో జగదేవుపేట వరకు పొడగించి కొత్తగా మంజూరు చేశారు. వెల్గటూరు-కోటిలింగాల మధ్య వంతెనకు ఇరువైపులా అప్రోచ్ రోడ్డు లేక భక్తులు, యాత్రికులు రాకపోకలకు అవస్థలు ఎదుర్కొంటున్నారు. కొత్తపేట ఎస్సీ కాలనీ మీదుగా పడకల్ వరకు రహదారి, పడకల్ చెరువు కట్ట మీదుగా కొత్తపేట వరకు రహదారులు కోతకు గురైనా మరమ్మతు చేపట్టడం లేదు. చెగ్యాం-శాలపల్లి గ్రామాల మధ్య రహదారి శిథిలావస్థకు చేరుకొంది.

కోతకు గురై ఏడాది..

మెట్‌పల్లి మండలం చింతలపేట గ్రామశివారులోని యూసుఫ్‌నగర్ రహదారిపై గతేడాది వర్షాకాలంలో భారీ వరదలు వచ్చాయి. వరదల వల్ల రహదారి భారీగా కోతకు గురైంది. రోడ్డు ఓవైపునకు పూర్తిగా కొట్టుకుపోగా ఏడాది గడుస్తున్నా మరమ్మతు చేపట్టకుండా అధికారులు నిర్లక్ష్యంగా వదిలేశారు. కోతకు గురైన ప్రదేశంలో కనీసం మట్టితో చదును చేయకుండా వదిలేశారు. ఈ రహదారిపై నిత్యం వివిధ గ్రామాలకు రాకపోకలు సాగిస్తుంటారు. దెబ్బతిన్న రోడ్డుపై ఎప్పుడు ఏప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. దగ్గర్లోని కల్వర్టు చిన్నదిగా ఉండటంతో నూతన వంతెన నిర్మాణం చేపడుతున్నారు.

కంకరతేలి.. గుంతలు పడి


మండలంలోని ఒబులాపూర్, కొత్తదాంరాజుపల్లి, గొర్రెపల్లి వద్ద 62వ జాతీయ రహదారి భారీ వర్షాలకు ఇరువైపులా కోతలకు గురికాగా మరమ్మతు లేకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. మండల కేంద్రం నుంచి మొగిలిపేట, రత్నాపూర్, గుండంపల్లి మార్గాల్లో వేసిన పంచాయతీరాజ్ రహదారులు కంకర తేలి, గుంతలుపడి అధ్వానంగా మారాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ ప్రాంతాల్లోని లింక్‌రోడ్లను బీటీ రహదారులుగా మార్చేందుకు అవసరమైన నిధులు మంజూరు చేయడం లేదు. పట్టణ, మండల కేంద్రానికి ప్రభుత్వ కార్యాలయాలతో పాటు బ్యాంకులు, ఇతర అవసరాల కోసం వచ్చేందుకు ప్రజలు, రైతులు నానా ఇబ్బందులకు గురవుతున్నారు.

వాహనదారుల ఇక్కట్లు

మండలంలోని పలుగ్రామాల మధ్య ప్రధాన రహదారులపై గుంతలు పడడంతో వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. మండలకేంద్రంలో ఇందిరా గాంధీ చౌరస్తా నుంచి ఒడ్డెర కాలనీ ప్రాథమిక పాఠశాల వరకు రెండు వరుసల రహదారిపై చాలా చోట్ల గుంతలు ఏర్పడ్డాయి. గోధూరు గ్రామం నుంచి మూలరాంపూర్ గ్రామం వరకు గల రెండు వరుసల రహదారిపై, యామాపూర్, ఫకీర్ కొండాపూర్ గ్రామాల మధ్య ఒక్క వరుస రహదారిపై, ఇబ్రహీంపట్నం నుంచి మెట్‌పల్లికి అమ్మక్కపేట మీదుగా వెళ్లే రెండు వరుసల ప్రధాన రహదారిపై పలు చోట్ల గుంతలున్నాయి. మరమ్మతు చేపట్టక పోవడంతో ఇబ్బందులు పడుతూ ప్రయాణించాల్సి వస్తోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నరకప్రాయంగా..మల్యాల అడ్డరోడ్డు సమీపంలో జగిత్యాల-కరీంనగర్ జాతీయ రహదారి పక్కన ప్రమాదకరమైన సైడ్‌బర్మ్‌లను మట్టితో చదును చేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. మల్యాల నుంచి మల్యాల అడ్డరోడ్డుకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారిపై పలు చోట్ల లోతైన గుంతలు ఏర్పడటంతో వాహనదారులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. రామన్నపేట నుంచి రాంపూర్, గొర్రెగుండం పోతారం, మద్దుట్ల తదితర గ్రామాలకు వెళ్లే రహదారులు కూడా చెడిపోయాయి. రామన్నపేట నుంచి నూకపల్లి ఆదర్శ పాఠశాల మీదుగా జాతీయ రహదారి వరకు తారురోడ్డు గుంతలు పడి పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ముత్యంపేట నుంచి కొండగట్టుకు వెళ్లే రహదారి గుంతలమయంగా మారింది.

# ఏ క్షణమైనా కూలొచ్చు!



భువనగిరి : వారం రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. పాత ఇళ్లకు ముప్పు ఏర్పడింది. అవి కూలిపోయే ప్రమాదం ఉంది. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో పాత ఇళ్లు వందల సంఖ్యలో ఉన్నాయి. రోజు కురుస్తున్న వర్షాలతో అవి నాని ఎప్పుడైనా కూలే ప్రమాదం ఉంది. అలాంటి వాటిలో కొన్ని ఇళ్లలో నిరుపేదలు నివసిస్తుండగా మరి కొందరు ఖాళీ చేసి ప్రత్యామ్నాయంగా ఏర్పాట్లు చేసుకున్నారు. గ్రామాల్లో అద్దె ఇళ్లు అందుబాటులో ఉండకపోవడంతో వాటిల్లోనూ బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తు న్నామన్నారు. గతంలో నిర్వహించిన పల్లె ప్రగతిలోనే ఇలాంటి ఇళ్లను గుర్తించారు. యజమానులకు నోటీసులు ఇచ్చి కూల్చివేశారు. నోటీసులు అందుకోని, తాళాలు వేసిన వాటిని వదిలేశారు.గుండాల మండలంలో 36, తుర్కపల్లి 35, నారాయణపురం 28, బొమ్మలరామారం 20 వరకు ఇళ్లు ఉన్నాయి. వీటిలో పాత కాలంలో కట్టినవే ఎక్కువగా ఉన్నాయి. భువనగిరి మున్సిపాలిటీ పరిధిలో ఆబాది, హన్మాన్‌వాడ, సంజీవనగర్‌లో శిథిలభవనాలు సంఖ్య అధికంగానే ఉంది. గతంలో పట్టణంలో పాత ఇళ్లు కూలీ ఒకరిద్దరు మృత్యువాత పడ్డ ఘటనలు ఉన్నాయి.

**తాజా సర్వేలో..**


ప్రభుత్వ ఆదేశాలతో ఇటీవల మళ్లీ సర్వే నిర్వహించారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లను పంచాయతీ కార్యదర్శులు గుర్తించారు. జిల్లా వ్యాప్తంగా 421 పంచాయతీల్లో 225 వరకు శిథిలమైన ఇళ్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అనధికారికంగా ఈ సంఖ్య రెండింతలకు పైగా ఉంటుందని అంచనా. జిల్లాలోని భువనగిరి, ఆలేరు, యాదగిరిగుట్ట, భూదాన్‌పోచంపల్లి, చౌటుప్పల్ మున్సిపాలిటీల్లో కూడా సుమారుగా 200 పైగా పాడుబడిన ఇళ్లు ఉన్నట్లు అధికారుల లెక్క. మారుమూల మండలాల్లోనే వీటి సంఖ్య ఎక్కువగా ఉంది.

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కె.గంగాధర్ ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శుల సమీక్ష సమావేశం నిర్వహించి పాత ఇళ్ల కూల్చివేతపై ఆదేశాలు జారీ చేశారు. గుండాల మండలంలో గంగపుత్రులు వలస వెళ్లారు. వారి ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. స్థానికంగా లేకపోవడంతో నోటీసులు జారీ చేయలేకపోయారు.

నోటీసులు ఇచ్చాం: సునంద, డీపీవో, యాదాద్రి భువనగిరి

పాత ఇళ్లను పంచాయతీ కార్యదర్శులు గుర్తించారు. 225 వరకు శిథిలమైనవి ఉన్నట్లు గుర్తించాం. వాటిని కూల్చివేయాలని యజమానులకు తాఖీదులు జారీ చేశాం. వెంటనే ఖాళీ చేయాలని చెప్పాం.

# వీధి వ్యాపారులకు గుర్తింపు




సూర్యాపేట : పురపాలికల్లోని వీధి వ్యాపారులకు ప్రత్యేక గుర్తింపు ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. వారి వ్యాపార నిర్వహణకు ఇప్పటికే రుణాలు మంజూరు చేసి ఆర్థికంగా ఆదుకుంటున్న ప్రభుత్వం ఇప్పుడు వీధి వ్యాపారానికి గుర్తింపునిచ్చే ప్రయత్నం చేస్తోంది. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని 19 పురపాలికల్లో 37,784 మంది వీధి వ్యాపారులు ఉన్నారు. నాలుగేళ్లుగా ప్రధాన మంత్రి స్వనిధి యోజన కింద ఎంపిక చేసిన వీధి వ్యాపారులకు ఉపాధి కల్పించేందుకు మొదటి విడత కింద రూ.10 వేలు, రెండో విడత రూ.20 వేలు, మూడో విడత కింద రూ.50 వేలు రుణం ఇస్తోంది. వీటిని సకాలంలో చెల్లించే వారికి సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యం కల్పిస్తోంది. తాజాగా ఆయా వ్యాపారులు చేసే పనికి ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.

**రక్షణగా కార్డులు** సూర్యాపేట, నల్గొండ, యాదాద్రి భువనగిరి జిల్లాల్లోని పురపాలికల్లో పీఎం స్వనిధి కింద వీధి వ్యాపారులు రుణాలు తీసుకొని లబ్ధి పొందుతుండగా వీరికి రక్షణగా ఉండేందుకు వీలుగా ప్రత్యేకంగా బోర్డులు ఏర్పాటు చేయించారు. వీరికి ఇప్పటికే గుర్తింపు కార్డులు జారీ చేశారు. పుర వీధుల్లో, మార్కెట్లో పని చేసే చోట సైన్‌బోర్డులు ఉండేలా చర్యలు చేపట్టారు. దీనిపై చిరు వ్యాపారుల ఫొటో, వ్యాపార నిర్వహణకు అనుమతించే ధ్రువపత్రం సంఖ్య, చిరునామా, ఏ వ్యాపారం చేస్తున్నారో వివరాలు రాయించారు. నెల కిందట ఇవి పురపాలికలకు చేరాయి. త్వరలోనే పంపిణీ చేసేందుకు రాష్ట్ర మెప్మా శాఖ అనుమతి కోసం ఎదురుచూస్తున్నారు. వారి నుంచి అనుమతి రాగానే వెంటనే పంపిణీకి చర్యలు తీసుకుంటామని మెప్మా జిల్లా అధికారులు పేర్కొంటున్నారు.

# వసూలు చేసుకో.. జేబులో వేసుకో

హైదరాబాద్: వినియోగదారుల నుంచి వసూలు చేస్తున్న విద్యుత్తు బిల్లులను సిబ్బందే పక్కదారి పట్టిస్తున్నారు. నెలల తరబడి సొంతానికి వినియోగించుకుంటున్నారు. తాము బిల్లులు చెల్లించినా.. కట్టలేదంటున్నారని వినియోగదారులు ఫిర్యాదు చేస్తే అప్పుడు వీళ్ల బాగోతాలు బయటపడుతున్నాయి. బిల్లుల లెక్కలను నెలనెలా పరిశీలించాల్సిన టీజీఎస్పీడీసీఎల్ అకౌంట్స్ విభాగాల అధికారుల పనితీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోనే పలు అక్రమాలు బయటపడ్డాయి.

**నాలుగు నెలలైనా ఏం చేశారు?**

షాద్‌నగర్ డివిజన్ పరిధిలో రూరల్ సెక్షన్‌కు చెందిన గ్రేడ్-2 ఆర్టిజన్ ఒకరు ఫిబ్రవరి 19 నుంచి జులై 18 వరకు 278 బిల్లులకు సంబంధించి రూ.3.63 లక్షలు వసూలు చేసి డిస్కం ఖజానాలో జమ చేయలేదు. ఓ వినియోగదారుడు బిల్లు చెల్లించినా బకాయి చూపడంతో ఫిర్యాదు చేశారు. అప్పుడు కూపీ లాగితే ఆర్టిజన్ నాలుగు నెలలుగా చేస్తున్న బాగోతం బయటపడింది. నాలుగు నెలలుగా పెద్ద మొత్తం సొమ్ము



సొంతానికి వాడుకుంటుంటే సంబంధిత ఏఏవో, జేఏవో క్యాష్ ఏ చేస్తున్నట్లు అనే ప్రశ్నలు వస్తున్నాయి. పక్షం రోజుల కిందనే ఈ బాగోతం సదరు అధికారుల దృష్టికి వచ్చినా.. సొమ్ములు కట్టేదాక ఆగి తర్వాత పైఅధికారులకు ఫిర్యాదు చేశారు.

**చెక్ బౌన్స్‌తో వెలుగులోకి..** కందుకూరులో ఏఏవో వినియోగదారులు చెల్లించే డబ్బులు నెలాఖరు వరకు సొంతానికి వినియోగించుకునేవారు. బయట అధిక వడ్డీలకు అప్పు ఇచ్చేవారు. నెలాఖరులో డిస్కం ఖాతాలో జమ చేసేవారు. ఈ బాగోతం చెక్‌బౌన్స్‌తో బయటపడింది. ఈ వ్యవహారంలో కుమ్మకైన జేఏవో క్యాష్, సీనియర్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేశారు. పదవీ విరమణ చేసిన ఓ ఉద్యోగికి సంవత్సరాల తరబడి డబుల్ పింఛన్ ఇచ్చారు. ఈ వ్యవహారంలోనూ బాధ్యుల్ని అప్పట్లో సస్పెండ్ చేశారు. తాజా వ్యవహారంతో రాజేంద్రనగర్ సర్కిల్‌తో సహా డిస్కంలోని మిగతా సర్కిళ్లలోని అకౌంట్స్ విభాగాలపై యాజమాన్యం నజర్ పెట్టింది.

# కారుణ్యంలో దళారీ దందా..

ఇల్లెందు : అనిశా, విజిలెన్స్ అధికారులు ప్రత్యేక నిఘా ఉంచినా సింగరేణిలో కారుణ్య నియామకాల పేరుతో దళారులు సాగిస్తున్న దందాకు అడ్డుకట్ట పడటం లేదు. కార్మికుల వారసులకు ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ రూ.లక్షల్లో వసూలు చేస్తున్నారు. మెడికల్‌లో అన్నీ తామై చూసుకుంటామని మాయమాటలు చెబుతూ అందినంతా దోచుకుంటున్నారు. తీరా మోసపోయాక, రూ.లక్షలు దండుకున్న అక్రమార్కుల చుట్టూ కార్మికులు, వారి కుటుంబ సభ్యులు ప్రదక్షిణలు చేస్తున్నారు. ఈ వ్యవహారంలో కొన్ని రాజకీయ, యూనియన్ల అండదండలుంటున్నాయన్న ఆరోపణలున్నాయి. ఇల్లెందు పట్టణంలోని ఓ ప్రధాన పార్టీ నాయకుడు మూడో వార్డుకు చెందిన కార్మికుడి వారసుడికి ఉద్యోగం ఇప్పిస్తానని రూ.8 లక్షలతో ఒప్పందం చేసుకుని రూ.4 లక్షలు తీసుకున్నాడు. ఏడాది గడుస్తున్నా ఉద్యోగం రాకపోవడంతో డబ్బు తిరిగివ్వాలని బాధితుడు అడిగాడు. నానాతిప్పలుపడితే రూ.1.50 లక్షలు ఇచ్చాడు. రూ.2.50 లక్షలు ఇవ్వకపోవటంతో బాధితుడు కోర్టును ఆశ్రయించేందుకు సిద్ధమయ్యారు. సింగరేణి ఉద్యోగిగా ఉంటూ దళారీ అవతారం ఎత్తిన ఓ ప్రముఖ యూనియన్ నాయకుడు కొన్నేళ్లుగా పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేస్తున్నాడు. ఆయన ప్రమేయం లేకున్నా అర్హులకు కారుణ్య కొలువులు రావటంతో ఆశావహులు పెద్దఎత్తున సమర్పించుకున్నారు. తీరా




కొంతమంది కార్మికుల వారసులకు ఉద్యోగం రాకపోవడంతో ఇంటిచుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

సింగరేణి సూపర్‌బజార్‌లో పనిచేసే ఉద్యోగి, ఓ పార్టీ నాయకునితో కలిసి ఉద్యోగం ఇప్పిస్తామని రూ.5 లక్షలు తీసుకుని ఆరు నెలలు గడిచాయి. బాధితుడు పోలీసులను ఆశ్రయించినట్లు సమాచారం.

నియామక విధానం ఇలా..

ప్రస్తుతం విధులు నిర్వహించే కార్మికులకు అనారోగ్య సమస్య తలెత్తితే రెండేళ్ల సర్వీసు ఉండగానే కారుణ్య నియామకానికి దరఖాస్తు చేసుకోవచ్చు. మెడికల్ బోర్డులోని వైద్యుల బృందం అతణ్ని పరీక్షించి ఉద్యోగానికి ఫిట్ లేదా అన్‌ఫిట్ అని ప్రకటించాలి. అనారోగ్యంతో ఉద్యోగం చేయలేని పరిస్థితి ఉంటే అన్‌ఫిట్ కార్మికుల వారసులకు ఉద్యోగ అవకాశం కల్పిస్తారు. ఈ క్రమంలో శాఖాపరమైన విచారణలు చేపడతారు.

దళారుల చేతిలో దరఖాస్తుదారుల చిట్టా

కారుణ్య నియామకాలకు దరఖాస్తు చేసుకున్న వారి జాబితా కొంతమంది ఉద్యోగుల ద్వారా దళారుల వద్దకు చేరుతోంది. దాన్ని ఆధారంగా వల విసురుతున్నారు. మధ్యవర్తుల అవతారమెత్తుతున్న వారిలో ఎక్కువగా సంస్థ ఉద్యోగులు, పలు యూనియన్ల నాయకులుం డటం, వారి రాజకీయ పలుకుబడి దృష్ట్యా కార్మికులు సులువుగా నమ్మేస్తున్నారు. మెడికల్ బోర్డులో ఇబ్బంది లేకుండా చూసి, వారసునికి ఉద్యోగం ఇప్పించేందుకు రూ.6-7లక్షల వరకు ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకుంటున్నారు. మొదటి విడత రూ.2-3 లక్షలు, ఉద్యోగం వచ్చాక మిగిలిన నగదు చెల్లించేలా డీల్ కుదర్చుకుం టున్నారు. దళారులను ఆశ్రయిస్తున్న వారిలో అర్హులతోపాటు, అనర్హు లు ఉంటున్నారు. అర్హులకు ప్రక్రియ ప్రకారం ఉద్యోగం వస్తే దళారీకి పంట పండినట్లే. అనర్హుడికి రాకపోతే డబ్బులు ఇవ్వకుండా ఎగ్గొడుతు న్నారు. కాలయాపన చేస్తూ కొంత ముట్టజెబుతున్నారు. ఇల్లెందుతో పాటు కొత్తగూడెం, మణుగూరు ఏరియా కార్మిక కుటుంబా లు పెద్ద ఎత్తున ఇలా మోసపోతున్నారు.'సింగరేణి సంస్థ నిబంధనల మేరకు కారుణ్య నియామకాల ప్రక్రియ కొనసాగిస్తాం. అర్హులైన కార్మికుల వారసులకు ఉద్యోగం వస్తుంది. దళారులను నమ్మి మోసపోవ ద్దు. ప్రలోభాలకు గురిచేసే వారి వివరాలు తెలియజేస్తే తగిన చర్యలు తీసుకుం టాం.' జీవీ మోహన్‌రావు, డీజీఎం పర్సనల్




అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో భారీ వర్షాల నేపథ్యంలో కాలువలు, డ్రెయిన్లు, చెరువులు, రిజర్వాయర్లు, ఏటి గట్ల పరిస్థితిపై ఏపీ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఇరిగేషన్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భారీ వర్షాలకు దెబ్బతిన్న చెరువులు, రిజర్వాయర్లు, ఏటి గట్లు, కాలువలను వెంటనే గుర్తించాలని మంత్రి నిమ్మల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. యుద్ధప్రాతిపదికన గండ్ల మరమ్మతు పనులు చేపట్టాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా ప్రణాళిక సిద్ధం చేసి పనులు ముమ్మరం చేయాలని ఆదేశించారు.

**అప్రమత్తంగా ఉండండి..** కాకినాడ జిల్లాలోని ఏలేరు రిజర్వాయర్‌కు చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అత్యధికంగా 45,000క్యూసెక్కుల వరదనీరు వచ్చిందని మంత్రి నిమ్మల తెలిపారు. ఫ్లడ్ మెనేజ్మెంట్ సరిగ్గా చేయడం వల్ల నష్ట తీవ్రతను తగ్గించగలిగామని పేర్కొన్నారు. ధవళేశ్వరం ప్రాజెక్టుకు ప్రస్తుతం 7లక్షల క్యూసెక్కుల వరద నీరు వస్తోందని, సాయంత్రానికి 10లక్షల క్యూసెక్కులకు చేరుకునే అవకాశం ఉందని మంత్రి వెల్లడించారు. సాయంత్రానికి మ్నెదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉండడంతో గోదావరి పరీవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి హెచ్చరించారు. కొల్లేరు అవుట్ ఫ్లో పెంచడానికి అడ్డంకిగా ఉన్న కిక్కీసను తొలగించాలని అధికారులను ఆదేశించారు. వరదనీటితో రాయలసీమకు సంబంధించిన రిజర్వాయర్లు, చెరువులు అన్నీ నింపి ప్రతిరోజూ నివేదిక అందించాలని సూచించారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.సాయిప్రసాద్, ఈఏన్సీ ఎం.వెంకటేశ్వరరావు, సహా పలువురు నీటి పారుదలశాఖ అధికారులు పాల్గొన్నారు.


**కోమసీమకు వరద ముప్పు..** మరోవైపు అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు భారీ వరద ముప్పు పొంచి ఉందని కలెక్టర్ మహేశ్ కుమార్ వెల్లడించారు. భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా ప్రజలు మరో 72గంటలపాటు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ హెచ్చరించారు. ఇవాళ సాయంత్రానికి 10లక్షల క్యూసెక్కులు వరదనీరు ధవలేశ్వరం నుంచి దిగువకు విడుదల చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. అలాగే రేపటికల్లా 13లక్షల క్యూసెక్కుల నీరు బ్యారేజీ నుంచి దిగువకు వదిలి రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉందని మహేశ్ కుమార్ వెల్లడించారు. భారీగా వరదనీరు దిగువకు వచ్చే అవకాశం ఉండడంతో లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు. లంక ప్రాంతాల్లో 17చోట్ల గోదావరి పాయలు దాటేందుకు ఇంజిన్ బోట్లు ఏర్పాటు చేశామని, ప్రజలను కాపాడేందుకు జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉందని కలెక్టర్ చెప్పారు. జిల్లా, డివిజన్, మండల కేంద్రాల్లో కంట్రోల్ రూములు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

పడవలు ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో పాఠశాలలకు సెలవు ప్రకటించినట్లు తెలిపారు. విపత్తులను ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉన్నట్లు కలెక్టర్ మహేశ్ కుమార్ పేర్కొన్నారు.

## ప్రకాశం బ్యారేజీ వద్ద పడవల తొలగింపు ప్రక్రియ ప్రారంభం

విజయవాడ: ప్రకాశం బ్యారేజీ వద్ద పడవల తొలగింపు ప్రారంభమైంది. జలవనరుల శాఖ ఇంజినీర్లు 2 భారీ క్రేన్లను తీసుకొచ్చి ఈ ప్రక్రియను మొదలుపెట్టారు. 50 టన్నుల బరువు ఎత్తే సామర్థ్యం ఉన్న 2 క్రేన్లతో పనులు జరుగుతున్నాయి. బ్యారేజీలోని 67, 68, 69 గేట్ల వద్ద 4 భారీ పడవులు చిక్కుకున్న విషయం తెలిసిందే.


ఈ నెల 1న ఎగువ నుంచి వచ్చి బ్యారేజీ కౌంటర్ వెయిట్లను అవి ధ్వంసం చేశాయి. బోల్తాపడిన పడవలను అక్కడి నుంచి తొలగించి దిగువకు పంపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం బ్యారేజీ వద్ద 2,09,937 క్యూసెక్కుల వరద దిగువకు వెళ్తోంది. ప్రవాహం వెళుతుండగానే పడవల తొలగింపు ప్రక్రియను అధికారులు చేపట్టారు. 68, 69 గేట్లను మూసివేసి పనులు కొనసాగిస్తున్నారు.



## వరద బాధితులకు సర్వేపల్లి పారిశ్రామికవేత్తల రూ.3 కోట్ల విరాళం

విజయవాడ: ఏపీలో వరద బాధితులను ఆదుకునేందుకు నెల్లూరు జిల్లా సర్వేపల్లి పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చారు.

మాజీ మంత్రి సోమిరెడ్డి ఆధ్వర్యంలో సర్వేపల్లి నియోజకవర్గం నుంచి రూ.3 కోట్ల విరాళం అందించారు. జెమినీ ఎడిబుల్ ఆయిల్స్ అండ్ ఫ్యాట్స్ లిమిటెడ్ సీఎం సహాయ నిధికి రూ. 2 కోట్ల విరాళాన్ని అందించగా.. పామాయిల్ పారిశ్రామికవేత్తలు రూ.50 లక్షల చొప్పున విరాళం ఇచ్చారు. విజయవాడ కలెక్టరేట్‌లో సీఎం చంద్రబాబును కలిసి చెక్కులు అందించారు. మరోవైపు ఎక్సైజ్ ఉద్యోగుల ఐకాస రూ.2.70కోట్ల విరాళం ప్రకటించింది. మంగళవారం సీఎం చంద్రబాబును ఐకాస నేతలు కలిసి చెక్కు అందజేశారు.



## ఇవాళ చంద్రబాబు పెళ్లిరోజు.. అయినా సరే..



అమరావతి: దాదాపు పది రోజులుగా సీఎం చంద్రబాబు కలెక్టరేట్‌లోనే ఉంటూ.. బస్సులోనే బస చేస్తున్నారు. ఇవాళ చంద్రబాబు, భువనేశ్వరీ దంపతుల పెళ్లి రోజు. అయినా సరే.. చంద్రబాబు ఇక్కడే వరద సహాయక చర్యల్లో నిమగ్నమై ఉండటంతో భువనేశ్వరి.. భర్తను కలిసేందుకు ఎన్టీఆర్ కలెక్టరేట్ ప్రాంగణానికి వచ్చారు. గత ఏడాది పెళ్లి రోజున చంద్రబాబు రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్నారు. ఇప్పుడు వరద సహాయక చర్యల్లో నిమగ్నమై ఉన్నారు. దీంతో భువనేశ్వరి వెళ్లి చంద్రబాబును కలిశారు. ఆమెతో కాసేపు మాట్లాడి వెంటనే చంద్రబాబు.. అధికారులతో టెలికాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో 10వ రోజు అందుతున్న సహాయక చర్యలపై సీఎం చంద్రబాబు నాయుడు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉత్తరాంధ్ర జిల్లాలు, కాకినాడ, తూర్పు గోదావరి, అంబేద్కర్ కోనసీమ జిల్లాల కలెక్టర్లతో మాట్లాడి భారీ వర్షాలు, ప్రస్తుత పరిస్థితులను చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు. వరద ముంపుపై ఎన్యుమరేషన్ రేపు సాయంత్రానికి పూర్తి చేయాలన్నారు. ఏ ఒక్కరూ మిస్ అవ్వకుండా ఎమ్యునరేషన్ జాగ్రత్తగా చేయాలన్నారు. ఈ రోజు సాయంత్రానికి వీధుల్లో నీళ్లన్నీ క్లియర్ అయిపోతాయన్నారు. పారిశుధ్యం పనులు నిరంతరం కొనసాగాలన్నారు. నిత్యావసర సరుకులు పంపిణీ బాగా జరుగుతోందని... నేటి సాయంత్రానికి సరుకుల పంపిణీ కూడా పూర్తి చేయాలని చంద్రబాబు ఆదేశించారు. విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొంటే ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించగలుగుతామని చంద్రబాబు పేర్కొన్నారు. మనది తుఫాన్లు అధికంగా ఉండే ప్రాంతమని.. దానికి అనుగుణంగా సమర్థవంతంగా ఎదుర్కొనేలా వ్యూహం సిద్ధం చేసుకోవాలన్నారు. వర్ష సూచన ఉన్న జిల్లాల అధికారులను ముందుగానే అలెర్ట్ చేయడం వల్ల ప్రాణ నష్టం తప్పిందని సీఎంకు ఆయా జిల్లాల అధికారులు తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాలు, ఈస్ట్, అంబేద్కర్ కోనసీమ, అల్లూరి సీతామారామరాజు, కాకినాడ జిల్లాల్లో ముందస్తు చర్యలతో పరిస్థితులు సాధారణంగానే ఉన్నాయని ఆయా జిల్లాల కలెక్టర్లు చెబుతున్నారు. జిల్లా కలెక్టర్లు అప్రమత్తత ఉండాలని.. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో వర్షాలు, వాగులు, వంకల పరిస్థితిపై పూర్తి అప్రమత్తంగా ఉండాలని చంద్రబాబు సూచించారు.

## భారీగా 'ఏలేరు' వరద.. ప్రత్తిపాడు-సామర్లకోట మార్గంలో రాకపోకలు బంద్

జగ్గంపేట గ్రామీణం: ఎగువన కురుస్తున్న వర్షాలతో కాకినాడ జిల్లా ఏలేరు కాల్వకు భారీగా వరద కొనసాగుతోంది. ఏలేరు జలాశయం నుంచి 27వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 46వేల క్యూసెక్కుల వరద చేరుతోంది. దీని ప్రభావం జిల్లాలోని 10 మండలాల పరిధిలోని 86 గ్రామాలపై పడింది. ఇప్పటికే ఆయా గ్రామాలు, కాలనీలను వరద చుట్టుముట్టింది. ఏలేశ్వరం, కిర్లంపూడి మండలాల్లో వేలాది ఎకరాల్లో పంట నీటమునిగింది. కిర్లంపూడి మండలం రాజుపాలెం, ఎస్ తిమ్మాపురం, గోపాలపట్నం, సుందరాయనపాలెం గ్రామాలు ఏలేరు వరద ముంపులో ఉన్నాయి. ఎస్ తిమ్మాపురం, రాజుపాలెం గ్రామాల వద్ద ఏలేరు కాల్వకు గండి పడడటంతో భారీగా వరద గ్రామాలను ముంచెత్తింది. దీంతో ఇళ్లు, పంట పొలాల్లోకి వరద చేరింది. దీంతో గ్రామాల నుంచి బయటకు వచ్చే మార్గంలేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. వరదల్లో చిక్కుకున్న బాధితులకు ఆహారం, నీరు అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ వరద ప్రభావిత ప్రాంతాల్లో



ట్రాక్టర్‌పై పర్యటించి బాధితులతో మాట్లాడారు. రాజుపాలెంలో 2.కి.మీ మేర రహదారిపై వరద ప్రవహిస్తోంది. ప్రత్తిపాడు–సామర్లకోట మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. గోపాలపట్నం, గొల్లప్రోలు, పిఠాపురం మండలాల్లోనూ వరద ప్రభావం ఎక్కువగా ఉంది. అధికారులు 35 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి 500 మందిని అక్కడికి తరలించారు. మరోవైపు ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యలకు దిగనున్నాయి. ఏలేరు వరద ప్రభావిత గ్రామాల్లో స్కూళ్లకు అధికారులు ఇవాళ సెలవు ప్రకటించారు.




## వినేశ్‌కు పోటీగా కెప్టెన్..అభ్యర్థుల జాబితా విడుదల చేసిన భాజపా

అసెంబ్లీ ఎన్నికల తేదీ దగ్గరపడుతున్న కొద్దీ హరియాణాలో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. అన్ని పార్టీలు వరుసపెట్టి అభ్యర్థుల జాబితాను విడుదల చేస్తున్నాయి. స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ పోటీ చేస్తుండటంతో జులానా అసెంబ్లీ నియోజకవర్గం వార్తల్లో నిలిచింది. ఆమె కాంగ్రెస్ అభ్యర్థికాగా.. అక్కడి నుంచి భాజపా యూత్ లీడర్ కెప్టెన్ యోగేశ్ బైరాగిని బరిలో దింపింది.

దాంతో అక్కడ వినేశ్ వర్సెస్ యోగేశ్‌గా మారింది. హరియాణాలో మొత్తం 90 నియోజకవర్గాలు ఉండగా.. 21 మంది అభ్యర్థులతో భాజపా రెండో జాబితాను విడుదల చేసింది. అందులోనే జులానా నుంచి యోగేశ్‌కు టికెట్ కేటాయించినట్టు వెల్లడించింది. ఆయన భారతీయ జనతా యువమోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు. భాజపా స్పోర్ట్స్ సెల్ హరియాణా విభాగానికి కో కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నారు. తన ఫేస్‌బుక్ బయోలో మాజీ పైలట్‌గా పేర్కొన్నారు. ఆయనది జింద్ జిల్లా. భాజపా ఇప్పటికే 67 మంది అభ్యర్థులతో తొలి జాబితాను విడుదల చేసిన సంగతి తెలిసిందే. భారత స్టార్ రెజ్లర్లు వినేశ్ ఫొగాట్, బజరంగ్ పునియాలు ఇటీవల కాంగ్రెస్‌లో చేరారు. దిల్లీలోని ఆ పార్టీ ప్రధాన కార్యాలయంలో సీనియర్ నేతల సమక్షంలో వీరిద్దరూ కాంగ్రెస్ కండువా వేసుకున్నారు. దీనికి ముందు ఈ రెజ్లర్లు అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసానికి వెళ్లి ఆయన్ను కలిశారు.

మరోవైపు, పార్టీలో చేరడానికంటే ముందే.. భారత రైల్వేలో ప్రస్తుతం తాము చేస్తున్న ఉద్యోగాలకు వినేశ్, పునియా రాజీనామా చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల తొలి జాబితాలో వినేశ్ పేరును కాంగ్రెస్ ప్రకటించింది. మరో రెజ్లర్ బజరంగ్ పునియాకు ఆల్ ఇండియా కిసాన్ కాంగ్రెస్ వర్కింగ్ ఛైర్మన్‌గా బాధ్యతలు అప్పజెప్పింది. గత శుక్రవారం హస్తం పార్టీ 31 మంది అభ్యర్థులతో జాబితాను విడుదల చేసింది.




## ప్రయాణించిన దూరానికే ఛార్జీ.. శాటిలైట్ ఆధారిత టోల్‌ను నోటిఫై చేసిన కేంద్రం

శాటిలైట్ ఆధారిత ఎలక్ట్రానిక్ టోల్ వసూలు దిశగా మరో ముందడుగు పడింది. ఎప్పటి నుంచో ఈ విధానాన్ని తీసుకొస్తామని ప్రకటిస్తూ వస్తున్న కేంద్ర రవాణా శాఖ.. తాజాగా దీన్ని నోటిఫై చేసింది. ఈ మేరకు జాతీయ రహదారుల ఫీజు నిబంధనలను (2008) సవరిస్తూ మంగళవారం నోటిఫికేషన్ జారీ చేసింది. దీని ప్రకారం.. టోల్ ప్లాజాల వద్ద కొత్తగా గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్ ఆధారిత టోల్ విధానం అమల్లోకి రానుంది.

ప్రస్తుతం అనుసరిస్తున్న ఫాస్టాగ్, ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ టెక్నాలజీకి అదనంగా ఈ కొత్త విధానం అమలు కానుంది. నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్‌తో కూడిన ఆన్ బోర్డు యూనిట్ కలిగిన వాహనాలు టోల్ ప్లాజా మీదుగా వెళ్లినప్పుడు.. ప్రయాణించిన దూరానికి గానూ టోల్ ఫీజు ఆటోమేటిక్‌గా చెల్లింపు జరిగిపోతుంది. ఈ తరహా వాహనాలకు ప్రత్యేక లేన్‌లను అమర్చనున్నారు. నావిగేషన్ డివైజ్ లేని వాహనాలకు సాధారణ టోల్ ఛార్జీలే వర్తిస్తాయి. అలాగే, కొత్తగా 20 కిలోమీటర్ల వరకు జీరో టోల్ కారిడార్‌ను తీసుకొచ్చారు. అంటే జాతీయ రహదారిపై 20 కిలోమీటర్ల వరకు టోల్ చెల్లించాల్సిన అవసరం లేదు. ఆపై ప్రయాణిస్తే దూరానికి తగ్గట్లు టోల్ చెల్లించాల్సి ఉంటుంది. టోల్ ప్లాజాల వద్ద రద్దీని తగ్గించేందుకు కేంద్రం ఎప్పటికప్పుడు మార్పులు చేస్తోంది.

ఒకప్పుడు మాన్యువల్‌గా చెల్లించే విధానం ఉండగా.. కొన్నేళ్ల క్రితం ఫాస్టాగ్‌ను తీసుకొచ్చారు. దీంతో కొన్ని సెకన్ల పాటు వాహనం ఆపి తర్వాత ముందుకెళ్లాల్సి ఉంటుంది. పైగా కిలోమీటర్లతో సంబంధం లేకుండా టోల్ చెల్లించాల్సిందే. కొత్త విధానంలో వాహనంలో ఉండే డివైజ్ ఎంత దూరం ప్రయాణించిందీ లెక్కగడుతుంది. దీంతో ప్రయాణించిన దూరానికే టోల్ చెల్లించాల్సి ఉంటుంది. పైగా టోల్ ప్లాజాల వద్ద ఆగాల్సిన అవసరం లేదు. తొలుత ప్రధాన జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలపై ఈ విధానాన్ని అమలు చేసి... తర్వాత దేశవ్యాప్తంగా తీసుకురానున్నట్లు తెలుస్తోంది.

## చంద్రబాబు ఢిల్లీ వెళ్లి సాయం తేవాలి.. కాదంటే బీజేపీ నుంచి బయటకు రావాలి

విజయవాడ: ఆంధ్రప్రదేశ్‌ను అన్ని విధాలా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మోసం చేశారని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆరోపణలు చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఢిల్లీ వెళ్లి సాయం తేవాలని.. కాదంటే బీజేపీ నుంచి బయటకు రావాలని సూచించారు. విజయవాడలో ఈరోజు(మంగళవారం) వరద ప్రభావిత ప్రాంతాల్లో షర్మిల పర్యటించారు. బాధితులను పరామర్శించి అండగా ఉంటానని షర్మిల ధైర్యం చెప్పారు. వరద బాధితులను పరామర్శించి, వస్త్రాలను షర్మిల పంపిణీ చేశారు.

**కేంద్ర సహాయం ఏదీ..** ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ... విజయవాడలో వరద. బీభత్సం అందరం చూశామని అన్నారు. బుడమేరు ముంపుతో ఏడు లక్షల మంది ప్రభావితం అయ్యారని చెప్పారు. 50 మంది వరదలతో ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అపారమైన ఆస్తి నష్టంతో ప్రజలు దెబ్బతిన్నారని అన్నారు. విజయవాడకు సమీపంలోనే రాజధాని అమరావతి ఉందని చెప్పారు. ఒక్క విజయవాడలో ఇంత నష్టం జరిగితే ప్రభుత్వం ఏం చేస్తోందని షర్మిల ప్రశ్నించారు. రూ. 6, 888 కోట్ల నష్టం జరిగిందని సీఎం చంద్రబాబు చెప్పారని గుర్తుచేశారు. కేంద్ర బృందాలు ఏపీకి వచ్చి, చూసి పరిశీలించి వెళ్లాయని.. మరీ సాయం ఎందుకు చేయలేదని షర్మిల ప్రశ్నించారు.. ఏపీపై కేంద్ర ప్రభుత్వానికి అంత చిన్న చూపు ఎందుకని షర్మిల నిలదీశారు.

**ఏపీకి ప్రధాని మోదీ ఎందుకు రావట్లేదు...** ఏపీ నుంచి ఎంపీలను గెలిపిస్తేనే బీజేపీ అధికారంలో ఉందన్న విషయం మరిచిపోకూడదని తెలిపారు. ప్రధాని మోదీ ఎక్కడెక్కడో తిరుగుతారని.. ఏపీకి ఎందుకు రావడం లేదని షర్మిల నిలదీశారు. అధికారం ఇచ్చిన ఏపీపై మోదీకి చిన్నచూపు ఎందుకని ప్రశ్నించారు. బీజేపీతో కలిసి ఉండటంతో ఏపీకి ఒరిగిందేమీ లేదని షర్మిల విమర్శలు చేశారు. సీఎం చంద్రబాబు ఈ విషయంపై వెంటనే ప్రజలకు సమాధానం చెప్పాలని షర్మిల డిమాండ్ చేశారు. తాము కేంద్రానికి రాష్ట్ర సమస్యలపై లేఖ రాశామని షర్మిల గుర్తుచేశారు.

**రేషన్ బియ్యం ఎలా తింటారు..** ఆంధ్రప్రదేశ్‌లో గుక్కెడు మంచి నీళ్లు కూడా అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల బాధలు వింటే ఆవేదన కలుగుతోందని వాపోయారు. భారీ వర్షాలకు ఇంట్లో సామాన్లు కూడా ఒక్కటీ మిగల్లేదని చెప్పారు. పేద, మధ్య తరగతి ప్రజల జీవితాలు తారుమారు అయ్యాయని అన్నారు. బాధితులకు




రేషన్ బియ్యం ఇచ్చారని... అవి ఎలా తింటారని ప్రశ్నించారు. ప్రజలు ఇన్ని ఇబ్బందులు పడుతుంటే సీఎం చంద్రబాబు ఏం చేస్తున్నారని షర్మిల నిలదీశారు. రైల్వే శాఖ మంత్రికి లేఖ రాసినా ఎందుకు స్పందన లేదని షర్మిల అడిగారు.

**రైల్వేశాఖ పట్టించుకోదా..** రైళ్లకు నీటిని విజయవాడలోనే నింపుతారని తెలిపారు. రూ. 6వేల కోట్ల ఆదాయం ఇచ్చే రైల్వేకు ప్రజల పట్ల బాధ్యత లేదా అని షర్మిల నిలదీశారు. ఏపీ ప్రజల సమస్యలు పట్టించుకోని బీజేపీతో ఉండటం ఏపీకి ఏం అవసరమో చంద్రబాబు ఆలోచించాలని అన్నారు. బుడమేరు ముంపు తప్పు మీదంటే మీదని వైసీపీ, టీడీపీ విమర్శలు చేసుకుంటున్నాయని షర్మిల ఆక్షేపించారు.

**వైఎస్ హయాంలో 'ఆపరేషన్ కొల్లేరు'...** గతంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 'ఆపరేషన్ కొల్లేరు' చేపట్టి కొంతమేర పనులు పూర్తి చేశారని గుర్తుచేశారు. ఆ తర్వాత వచ్చిన పాలకులు ఆక్రమణలను ప్రోత్సహించారని ఆరోపించారు. కనీసం కాల్వలకు చేయాల్సిన మరమ్మతులు కూడా ఎందుకు చేయలేదని నిలదీశారు. బుడమేరు ముంపునకు అందరూ కారకులేనని విమర్శలు చేశారు. ప్రజల గురించి ఆలోచన చేసే కాంగ్రెస్ ఏపీలో అధికారంలోకి రావాలని కోరుకున్నారు. ఆక్రమణలు పూర్తిగా తొలగించి చర్యలు తీసుకోవాలని అన్నారు. వరద బాధిత కుటుంబాలకు లక్ష రూపాయల చొప్పున సహాయం అందజేయాలని షర్మిల డిమాండ్ చేశారు.

## లక్షలాది మంది జలసమాధి అయ్యేలా జగన్ కుట్ర: మంత్రి నారా లోకేశ్

అమరావతి: వరద ముంపునకు ప్రభుత్వమే కారణమంటూ వైకాపా విష ప్రచారం చేస్తోందని మంత్రి నారా లోకేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వైకాపా కుట్రలు బయటపడకుండా ఆ పార్టీ నేతలు ఇలా చేస్తున్నారని మండిపడ్డారు. లక్షలాది మంది జలసమాధి అయ్యేలా సైకో జగన్ పన్నిన కుట్ర బట్టబయలైందన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో ఆయన పోస్ట్ చేశారు. "అధికారం అండతో సైకో జగన్ తన ఇసుక మాఫియా కోసం అన్నమయ్య డ్యాం కొట్టుకుపోయేలా చేసి 50 మందిని చంపారు. 5 ఊర్లను నామరూపాలు లేకుండా చేశారు. ఇదే ప్లాన్ ప్రకారం ఇనుప పడవలతో ప్రకాశం బ్యారేజీని ఢీకొని కూల్చేయాలని కుట్ర చేశారు. విజయవాడతో పాటు పదుల సంఖ్యలో లంక గ్రామాల నామరూపాలు లేకుండా చేసి లక్షలాది మంది జలసమాధి అయ్యేలా జగన్ పన్నిన కుట్ర బట్టబయలైంది. దీన్ని ప్లాన్ చేసింది సైకో జగన్



అయితే.. అమలు చేసింది వైకాపా ఎమ్మెల్సీ తలశిల రఘురాం, మాజీ ఎంపీ నందిగం సురేశ్" అని లోకేశ్ పేర్కొన్నారు.

# బిగ్ బాస్ లోకి బోల్డ్ బ్యూటీ.. బాల్ తో ఇప్పుడు అలా!

కన్నడ బ్యూటీ జ్యోతి రాయ్ తెలుగులో ఎలాంటి ఫ్యాన్ బేస్ దక్కించుకుందో అందరికీ తెలిసిందే. ఒకే ఒక్క సీరియల్ తో వేరే లెవెల్ లో క్రేజ్ సంపాదించుకుంది. గుప్పెడంత మనసు ధారావాహికలో యాక్ట్ చేసి అందరినీ మెప్పించింది. జగతి పాత్రలో అమ్మగా, టీచర్ గా కనిపించి మంచి మార్కులు కొట్టేసింది. సీరియల్ అంతా చీరల్లో ఎంతో పద్ధతిగా కనిపించి ఫిదా చేసింది. ఆ తర్వాత సినిమాలతో పాటు వెబ్ సిరీసుల్లో ఛాన్స్ అందుకుంది. దీంతో గుప్పెడంత సీరియల్ నుంచి బయటకు వచ్చేసింది అమ్మడు. అయితే సీరియల్ లో చీరల్లో పద్ధతిగా కనిపించిన జ్యోతి రాయ్.. సోషల్ మీడియాలో ఓ రేంజ్ లో అందాలు ఆరబోస్తూ ఉంటుంది. ఎప్పుడూ యాక్టివ్ గా ఉంటూ ఫోటోలు పోస్ట్ చేస్తుంటుంది. పొట్టి డ్రెస్సులు, మోడ్రన్ ఔట్ ఫిట్స్ వేసుకుని పిక్స్ దిగుతూ సందడి చేస్తుంటుంది. గ్లామర్ డోస్ ఫుల్ గా పెంచేసి అలరిస్తుంటుంది. కుర్రాళ్ల మతులు పోగుడుతుంటుంది. తాజాగా కొత్త పిక్ షేర్ చేసింది జ్యోతి రాయ్. షార్ట్ జీన్ నిక్కర్, పొట్టి టాప్ తో క్లీవేజ్ షో చేసింది. థైస్ షోతో మైండ్ బ్లాక్ చేసింది. ఆమె బాడీపై ఉన్న టాటూను చూపిస్తూ మాయ



చేసింది. తన షైనింగ్ స్కిన్ టోన్ తో అట్రాక్ట్ చేసింది. సింపుల్ మేకప్ తో ఫిదా చేసింది. పక్కన బాల్ పై హ్యాండ్ వేసి ట్రెండీగా కూర్చుని పోజు ఇచ్చింది. ప్రస్తుతం ఈ పిక్ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. జ్యోతి రాయ్.. నయా పిక్ సూపర్ గా ఉందని కామెంట్లు పెడుతున్నారు. అమ్మడు థైస్ షో, గ్లామర్ స్టన్నింగ్ గా ఉందని చెబుతున్నారు. లైకులు కొడుతూ.. పిక్ ను తెగ వైరల్ చేస్తున్నారు. అందానికి పర్యాయపదమంటూ కొనియాడుతున్నారు. అదే సమయంలో జ్యోతి రాయ్ కు సంబంధించిన ఇంట్రెస్టింగ్ న్యూస్ నెట్టింట తెగ వైరల్ అవుతోంది. అమ్మడు తెలుగు బిగ్ బాస్-8 సీజన్ లోకి వైల్డ్ కార్డ్ ఎంట్రీ ఇస్తుందని చెబుతున్నారు. అందుకు తగ్గ అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయని అంటున్నారు.

త్వరలోనే ఆమె హౌస్ లోకి వెళ్లనుందని కామెంట్లు పెడుతున్నారు. అయితే సీజన్ స్టార్టింగ్ నుంచే ఆమె హౌస్ లోకి వెళ్లాల్సిందని.. కానీ కొన్ని కారణాల వల్ల వెళ్లలేదని చెబుతున్నారు. ఇప్పుడు వైల్డ్ కార్డ్ ఎంట్రీకి సిద్ధమవుతోందని అంటున్నారు. హీట్ పుట్టించే పిక్స్ తో నెట్టింట ఎప్పుడూ వైరల్ అయ్యే జ్యోతి రాయ్.. బిగ్ బాస్ హౌస్ లో ఎలాంటి సందడి చేస్తుందోనని కామెంట్లు పెడుతున్నారు. మరి జ్యోతి రాయ్ వైల్డ్ కార్డు ద్వారా బిగ్ బాస్ హౌస్ లోకి ఎప్పుడు ఎంట్రీ ఇస్తుందో.. ఎలా అలరిస్తుందో వేచి చూడాలి.

# బుట్టబొమ్మపై ఇంకా ఆశ చావలేదు!

టాలీవుడ్ లో అగ్ర హీరోలందరి సరసనా నటించింది పూజా హెగ్డే. ప్రభాస్, మహేష్, ఎన్టీఆర్, రామ్ చరణ్, నాగచైతన్య సహా పలువురు టాప్ స్టార్ల సరసన నటించింది. భారీ పారితోషికంతో పాటు, తన సిబ్బందికి వసతులు, పెద్ద జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేయడంతో పూజా పై నెగెటివ్ టాక్ స్ప్రెడ్ అయింది. తనను పలువురు నిర్మాతలు సంప్రదించినా పారితోషికం సహా ఇతర వసతుల విషయంలో పూజా ఎక్కడా తగ్గలేదని కథనాలొచ్చాయి. డిమాండ్ ఉన్నంత కాలం అన్నిటినీ ఇచ్చారు కానీ, బ్యాక్ టు బ్యాక్ ఫ్లాపులొచ్చాక ఆ సీన్ కనిపించలేదు. దీనికి తోడు పెద్ద స్టార్లు సైతం తమ సినిమాల నుంచి పూజాను తప్పించాల్సి వచ్చింది. త్రివిక్రమ్, హరీష్ శంకర్ లాంటి దర్శకులు



పూజాను తమ సినిమాల నుంచి తప్పించారు. పవన్, మహేష్ లాంటి స్టార్ల సినిమాల్లో అవకాశాల్ని కోల్పోయింది. అదే సమయంలో తనను సంప్రదించిన దర్శకనిర్మాతలకు నో చెప్పిందని కూడా కథనాలొచ్చాయి. ప్రతిసారీ తన డిమాండ్లు వదులుకోకపోవడంతో ఇక దర్శకనిర్మాతలు కూడా లైట్ తీస్కున్నారు. సాయిధరమ్ తేజ్‌తో పూజా హెగ్డే తెలుగులో ఒక సినిమా చేసింది కానీ ఆ సినిమా ఆగిపోయింది. ఈ నటి టాలీవుడ్‌కి తిరిగి రావడానికి ఎలాంటి ప్రయత్నాలు చేయకపోవడం ఆశ్చర్యపరిచింది. అయితే పూజా ఎలా ఉన్నా ఇక్కడ అందరి కళ్లకు ఇంకా బుట్టబొమ్మే. అల వైకుంఠపురములో పొడుగు కాళ్ల సుందరి రూపం ఇంకా అలానే అభిమానులకు గుర్తుండిపోయింది. అందుకే ఇంకా మన దర్శకనిర్మాతల్లోను ఆశ చావ లేదు. షాహిద్ కపూర్ దేవా సహా సూర్య భారీ చిత్రంతో పూజా బిజీగా ఉంది. తెలుగులో ఏ నిర్మాత ప్రయత్నాలు ఫలిస్తాయో వేచి చూడాలి.





# దేవర జోరు కోసం హిందీలో ఆ ఇద్దరు



యంగ్ టైగర్ ఎన్టీఆర్ దేవర మూవీ సెప్టెంబర్ 27న వరల్డ్ వైడ్ గా రిలీజ్ కాబోతోంది. ఈ నేపథ్యంలో సినిమా ప్రమోషన్స్ షురూ చేశారు. అందులో భాగంగా సెప్టెంబర్ 10న ముంబై వేదికగా దేవర ట్రైలర్ ని రిలీజ్ చేయబోతున్నారు. ట్రైలర్ రిలీజ్ ని పెద్ద ఈవెంట్ గా నిర్వహించబోతున్నారు. ఆర్ఆర్ఆర్ తో వచ్చిన క్రేజ్ ని నెక్స్ట్ లెవల్ కి తీసుకొని వెళ్లాలని తారక్ అనుకుంటున్నాడు. అందుకే ముంబై నుంచి దేవర ప్రమోషన్స్ సందడి స్టార్ట్ చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఈ ట్రైలర్ రిలీజ్ ఈవెంట్ లో ఎన్టీఆర్, జాన్వీ కపూర్, సైఫ్ అలీఖాన్ పాల్గొననున్నారు. అలాగే చిత్ర యూనిట్ మొత్తం పార్టిసిపేట్ చేయనున్నారంట. ట్రైలర్ తో సినిమాపై అంచనాలు అమాంతం పెరుగుతాయని భావిస్తున్నారు. ఎన్టీఆర్ కెరియర్ లో ఆర్ఆర్ఆర్ తర్వాత సెకండ్ హైయెస్ట్ బడ్జెట్ మూవీగా దేవర తెరకెక్కుతోంది. ఇదిలా ఉంటే ఈ సినిమా ప్రమోషనల్ ఇంటర్వ్యూ కోసం బాలీవుడ్ స్టార్స్ ని రంగం లోకి దించుతున్నారంట. ఆర్ఆర్ఆర్ సినిమాలో అలియా భట్ హీరోయిన్ గా నటించింది. ఈ షూటింగ్ సమయంలో ఎన్టీఆర్ తో అలియా భట్ కి మంచి బాండింగ్ ఏర్పడింది. ఈ నేపథ్యంలో దేవర సినిమా ప్రమోషనల్ ఇంటర్వ్యూ కోసం అలియా భట్ వస్తోందంట. అలాగే బడా నిర్మాత కరణ్ జోహార్ కూడా దేవర మూవీ హిందీ ప్రమోషన్స్ ని దగ్గరుండి చూసుకుంటున్నారంట. ఎన్టీఆర్, జాన్వీ కపూర్ తో పాటు దేవర ప్రమోషనల్ ఇంటర్వ్యూలో కరణ్ జోహార్, అలియా భట్ పాల్గొంటారంట. అలియా భట్ ఎన్టీఆర్, జాన్వీ కపూర్ ని ఇంటర్వ్యూ చేస్తుందంట. కరణ్ జోహార్, అలియా భట్ కి బాలీవుడ్ లో క్రేజ్ ఉంది. వీరిద్దరూ దేవర సినిమా ప్రమోషన్స్ లో పార్టిసిపేట్ చేస్తే కచ్చితంగా అది హిందీ మార్కెట్ లో ప్లస్ అవుతుందని భావిస్తున్నారు. అయితే ముందుగా దేవర ట్రైలర్ కచ్చితంగా బాలీవుడ్ ఆడియన్స్ కి రీచ్ అవ్వాలి. అలా అయితే కరణ్, అలియా చేసే ప్రమోషన్స్ ప్లస్ అవుతాయి. ఇప్పటి వరకు దేవర నుంచి వచ్చిన సాంగ్స్ అయితే హిందీలో కూడా మంచి ఆదరణ సొంతం చేసుకున్నాయి. జాన్వీ కపూర్, సైఫ్ అలీఖాన్ స్టార్ ఇమేజ్ కూడా దేవరకి ప్లస్ అయ్యే ఛాన్స్ ఉందని ట్రేడ్ పండితులు భావిస్తున్నారు. దేవర ట్రైలర్ రిలీజ్ కి ఇంకా ఒక్క రోజు మాత్రమే గడువు ఉంది. ఈ ట్రైలర్ కోసం తారక్ ఫ్యాన్స్ ఎగ్జైటింగ్ తో ఎదురుచూస్తున్నారు.

# చిరు ద్విపాత్రలు.. హరీష్ దర్శకత్వం!



ద్విపాత్రాభినయంతో రక్తి కట్టించడంలో మెగాస్టార్ తర్వాతే! మాస్‌ని ఒక ఊపు ఊపడంలో ఆయన కామెడీ టైమింగ్ పెర్ఫామెన్స్ గురించి ఎంత చెప్పినా తక్కువే. ఇప్పుడు ఒక కమర్షియల్ ప్రకటన కోసం మెగాస్టార్ పెర్ఫామెన్స్ ఇదే తీరుగా చర్చనీయాంశం అవుతోంది. ఇది ఒక పాల ఉత్పత్తికి సంబంధించిన యాప్ కి ప్రమోషన్. దీనికి షాపులు ఉండవు.. ఆన్ లైన్ లో ఆర్డర్ చేయడమే. ఈ ప్రకటన కోసం మెగాస్టార్ లోని అందరివాడు బయటకు వచ్చాడు. వీడియోలో చిరంజీవి షాట్‌కు సిద్ధమవుతూ ఉంటే.. అకస్మాత్తుగా ఆయనలోంచి ఆత్మారావు బయటకు వస్తాడు. ఆత్మారావుతో మెగా బాస్ మాటల్లోనే బ్రాండ్ గురించిన వివరాలు వెల్లడయ్యాయి. హాస్యనటుడు సత్య అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఈ ప్రకటనలో కనిపించాడు. అతడు షాట్ సిద్ధంగా ఉందని చెప్పడానికి చిరు వద్దకు వస్తాడు. కానీ చిరు ఎవరితోనో మాట్లాడటం చూసి కంగారు పడిపోతాడు. ఆత్మతో సంభాషిస్తూనే... తన డైలాగులను రిహార్సల్ చేస్తున్నాడని సత్యకు చెప్పారు చిరు. ఒక్క డైలాగ్ కోసం రిహార్సలా? అంటూ సత్య ఆశ్చర్యపోతాడు. జై చిరంజీవ అని సత్య అంటాడు. ఈ షాట్‌లో చిరు అందరివాడు, ఘరానా మొగుడు టింజ్ ని ప్రదర్శించడం అభిమానులకు ట్రీట్ అనడంలో సందేహం లేదు. ప్రకటనలో మెగా బాస్ ద్విపాత్రాభినయం అదుర్స్. మాస్ డైరెక్టర్ హరీష్ శంకర్ ఈ ప్రకటన రూపొందించారు. చిరు కామిక్ టైమింగ్, డైలాగ్ పవర్ ని వందశాతం వాడుకుని ప్రకటనను సక్సెస్ చేసాడు. మొత్తానికి ఆన్ లైన్ మిల్క్ బ్రాండ్ యాప్ లను ప్రజలు ఏ మేరకు డౌన్ లోడ్ చేస్తారన్నది వేచి చూడాలి. ప్రచారం చేసింది మెగా బాస్ కాబట్టి.. ఇప్పటికే ఫ్యాన్స్ డౌన్ లోడింగ్ ప్రాసెస్ లో ఉన్నారని అంచనా వేయొచ్చు.

# కేతిక శర్మ.. కిల్లర్ లుక్స్ కి ఫిదా అవ్వాల్సిందే

మొదట మోడలింగ్ లోకి అడుగుపెట్టిన కేతిక శర్మ, తన అందం, స్టైల్, క్యూట్ నెస్ తో యూత్ లో గుర్తింపు తెచ్చుకుంది. కేతిక యూట్యూబర్ గా కెరీర్ ప్రారంభించి, అక్కడ తన పాపులారిటీతో సినిమాల్లో ఛాన్సులు దక్కించుకుంది. తన మొదటి సినిమా రొమాంటిక్ లో ఆకాష్ పూరి సరసన నటించి మంచి ఫేమ్ తెచ్చుకుంది. ఆ సినిమాలో కేతిక తన గ్లామర్, యాక్టింగ్ టాలెంట్ తో ప్రేక్షకుల మనసు దోచుకుంది. తొలి సినిమాతో మంచి పేరును సంపాదించినా, ఆ తర్వాతి ప్రాజెక్టులు లక్ష్య మరియు రంగ రంగ వైభవంగా ఆశించిన విజయాన్ని అందించలేకపోయాయి. అయినప్పటికీ, కేతిక తన క్యూట్ లుక్స్ తో యూత్ లో క్రేజ్ సంపాదించుకుంటూనే ఉంది. ఆమెకి వచ్చిన అవకాశాలు పెద్దగా బ్లాక్ బస్టర్స్ కాకపోవడం వల్ల, టాలీవుడ్



లో తనకి నిరంతరంగా మంచి బ్రేక్ కోసం ఎదురు చూస్తోంది. బ్రో సినిమాతో మళ్ళీ తెరపై కనిపించిన కేతిక, పవన్ కళ్యాణ్, సాయి తేజ్ లతో కలిసి నటించింది. ఈ సినిమా మంచి విజయాన్ని సాధించినప్పటికీ, కేతిక కి మరింత గుర్తింపు రావాల్సిన అవసరం ఉంది. ఇక సోషల్ మీడియా ద్వారా తన క్రేజ్‌ను కాపాడుకుంటూ, అందమైన ఫోటో షూట్స్‌తో తరచూ అభిమానులను ఆకట్టుకుంటోంది. రీసెంట్ గా కేతిక తన స్టైలిష్ లుక్స్ తో అభిమానులకు ఒక రకమైన ఫ్యాషన్ సిగ్నల్ ఇస్తూ ఫోటోలు పంచుకుంటోంది.

ఈ ఫోటోలకు ఫ్యాన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వస్తోంది. సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండటం, తన అభిమానులతో కంటెక్ట్ లో ఉండటం వల్ల, కేతిక తన క్రేజ్ ను ఎప్పటికప్పుడు పెంచుకుంటూ చేస్తోంది. ప్రస్తుతం కొన్ని కొత్త ప్రాజెక్ట్స్ కోసం చర్చలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ ఆమెకు మంచి కథలు, పాత్రలు వస్తే, త్వరలోనే టాలీవుడ్ లో కేతిక శర్మ టాప్ హీరోయిన్ గా ఎదిగే అవకాశం ఉన్నదని ఆమె అభిమానులు ఆశిస్తున్నారు.

# సమంత డిమాండ్ పై త్వరలోనే స్పందన?

తెలుగు చలన చిత్ర పరిశ్రమలో గతంలో వేసిన సబ్ కమిటీ నివేదికను విడుదల చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని సమంత కోరిన సంగతి తెలిసిందే. మాలీవుడ్ లో జస్టిస్ హేమ కమిటీ నివేదిక దేశ వ్యాప్తంగా సంచలనమైన వేళ సమంత ఈ డిమాండ్ ని తెరపైకి తెచ్చింది. ఇండస్ట్రీలో మహిళలపై జరుగుతోన్న లైంగిక దాడుల్ని అరికట్టాలంటే ప్రభుత్వం ఆధ్వర్యంలో కమిటీలు వేసిన ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు నటీమణులు డిమాండ్ చేసారు. మరి సమంత డిమాండ్ పై రేవంత్ సర్కార్ నివేదిక రిలీజ్ కి రెడీ అవుతుందా? ఇండస్ట్రీలో రేవంత్ మార్క్ రూలింగ్ హైలైట్ అవ్వాలంటే ఇదే సరైన సమయంగా భావిస్తున్నారా? ఇండస్ట్రీపై కొరడా ఝుళిపిం చడానికి రెడీ అవుతున్నారా? అంటే అవుననే విశ్వసనీయ సమాచారం అందుతోంది. సమంత డిమాండ్ అధికారుల దృష్టి కి వెళ్లడంతో విషయాన్ని సీఎం రేవంత్ చెవిన వేసినట్లు రాజకీయ వర్గాల్లో గుస గుస మొదలైంది. అప్పటి టీఆర్ ఎస్ ప్రభుత్వం వేసిన కమిటీ ఇండస్ట్రీలో ఎలాంటి పురోగతి సాధించిందో తెలియాలంటే సబ్ కమిటీ నివేదకను అధికారికంగా రిలీజ్ చేయకపోయినా లోగుట్టుగా



దాని సంగతేంటో తేల్చాలని ఆయా పార్టీ వర్గాల్లో చర్చకు దారి తీస్తోందిట. అయితే ఇది ఎంతో సున్నితమైన అంశం. ఇలాంటి నివేదికలు చాలా విషయాల్ని పరిగణలోకి తీసుకుని రిలీజ్ చేస్తుంటారు. కన్నడలో హేమ కమిటీ లాంటిది రావాలని కొంత మంది నటీమణులు డిమాండ్ చేయగా పరిశ్రమ అలాంటి కమిటీలు అవసరం లేదని భావించింది. గతంలో జరిగిన విషయాలకు..మాలీవుడ్ కమిటీ నివేదికకు సంబంధం ఏంటనే అంశాన్ని లేవనెత్తారు. మరి టాలీవుడ్ లో ఇలాంటి అంశం తెరపైకి వస్తుందా? లేదా? సమంత డిమాండ్ మేరకు సబ్ కమిటీ నివేదికను రిలీజ్ చేస్తారా? అన్నది చూడాలి. ఇండస్ట్రీ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి కాస్త నెగిటివ్ గానే ఉన్నారనే ప్రచారంలో ఉంది. గద్దర్ అవార్డ్ లపై ఇండస్ట్రీ నుంచి సానుకూలంగా స్పందన రాకపో వడంతో రేవంత్ అసంతృప్తిని వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. అలాగే చిత్ర పరిశ్రమకు చెందిన అక్కినేని నాగార్జున ఎన్-కన్వెన్షన్ ని రేవంత్ సర్కార్ అక్రమ కట్టడంగా కూల్చి వేసిన ఉదంతం పలు సందేహాలకు తావిస్తోంది. మరి ఇలాంటి సమయంలో సమంత డిమాండ్ చేసిన నివేదిక రేవంత్ ప్రభుత్వం రిలీజ్ చేస్తే అతి పెద్ద సంచలనమే అవుతుంది.



# కేంద్ర పన్నుల్లో రాష్ట్రాల నిధుల వాటా 50శాతానికి పెంచాలి: సీఎం రేవంత్

హైదరాబాద్: కేంద్ర పన్నుల్లో రాష్ట్రాల నిధుల వాటాను 50శాతానికి పెంచాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఆర్థిక సంఘాన్ని కోరారు. మంగళవారం ప్రజాభవన్‌లో 16వ ఆర్థిక సంఘం సమావేశం జరిగింది. ఆర్థిక సంఘానికి సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర పరిస్థితిని వివరించారు. తెలంగాణను 'ఫ్యూచర్ స్టేట్'గా పిలుస్తున్నామన్నారు. బలమైనా పునాదులున్నా.. రాష్ట్రం ఆర్థిక సవాళ్లు ఎదుర్కొంటోందని చెప్పారు. భారీ రుణభారం రూ.6.85లక్షల కోట్లకు చేరుకుందన్నారు. "గత పదేళ్లలో మౌలిక ప్రాజెక్టులకు భారీగా అప్పులు చేశారు. ఆదాయంలో అధికంగా రుణాల చెల్లింపులకే వెచ్చించాల్సిన పరిస్థితి నెలకొంది. రుణాలు, వడ్డీ చెల్లింపులు సక్రమంగా నిర్వహించాల్సి ఉంది. నిర్వహణ సరిగా లేకపోతే రాష్ట్ర పురోగతిపై ప్రభావం పడుతుంది. రుణ సమస్య పరిష్కారానికి తగిన సహాయం, మద్దతు ఇవ్వాలి. రుణాల్ని రీస్ట్రక్చర్ చేసే అవకాశం ఇవ్వాలి. రీస్ట్రక్చర్ చేయకపోతే అదనపు ఆర్థిక సాయం చేయాలి. తెలంగాణను ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతాం. దేశాన్ని మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మార్చడంలో మా వంతు బాధ్యత నెరవేరుస్తాం"అని సీఎం రేవంత్ తెలిపారు.

# శాసనసభ నియమాల ప్రకారమే పీఏసీ ఛైర్మన్ నియామకం: శ్రీధర్‌బాబు



హైదరాబాద్: శాసనసభ నియమాల ప్రకారమే పీఏసీ ఛైర్మన్‌ను స్పీకర్ నియమించారని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. సీఎల్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. " నేను భారాస ఎమ్మెల్యేను అని పీఏసీ ఛైర్మన్ అరికెపూడి గాంధీ చెప్పారు. భారాస నేతలతో పీఏసీ ఛైర్మన్‌కు అభిప్రాయభేదాలు ఉంటే మాకేం సంబంధం?. ప్రభుత్వాన్ని నడపాలని ప్రజలు మాకు తీర్పు ఇచ్చారు. ఫలితాల తర్వాత కూడా ఏదో జరుగుతుందని భారాస నేతలు కొన్ని రోజులు తిరిగారు. అంత తిరిగిన తర్వాత కూడా ప్రజలు మరోసారి తీర్పు ఇచ్చారు. భారాస వైఖరి మారలేదని చెప్పి.. లోక్‌సభ ఎన్నికల్లో జీరో తీర్పు ఇచ్చారు. జీరో ఎంపీ సీట్లు ఇచ్చినా కూడా ఆ పార్టీ వైఖరి మారలేదు. రాజ్యాంగ స్ఫూర్తి గురించి మాట్లాడే నైతిక హక్కు భారాసకు లేదు. ఇప్పటికైనా భారాస నేతలు వ్యవస్థలను గౌరవించాలి" అని శ్రీధర్‌బాబు సూచించారు.

# బీఆర్ఎస్ చేస్తే సంసారం.. మేం చేస్తే వ్యభిచారమా?: దానం నాగేందర్




హైదరాబాద్: బీఆర్ఎస్ నుంచి అధికార కాంగ్రెస్ పార్టీలో చేరిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పార్టీ మారిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అంశంపై శాసన సభాపతి నిర్ణయం తీసుకోవాలంటూ హైకోర్ట్ ఆదేశించిన నేపథ్యంలో మాట్లాడిన ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎమ్మెల్యేలు పార్టీ మారిన విషయంపై మాట్లాడుతూ.. బీఆర్ఎస్ చేస్తే సంసారం.. మేం చేస్తే వ్యభిచారమా? అని ఆయన ప్రశ్నించారు. "నేను రూల్ ప్రకారమే ఎంపీగా పోటీచేశాను. బీఆర్ఎస్ వాళ్లు మాకు రూల్స్ చెప్తారా?. అనర్హత గురించి మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్‌కి లేదు. ఫిరాయింపులకు శ్రీకారం చుట్టిందే కేసీఆర్" అని దానం నాగేందర్ మండిపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వ హాయాంలో పీఏసీ ఛైర్మన్ బాధ్యతలు అక్బరుద్దీన్ ఒవైసీకి ఎందుకు ఇచ్చారని బీఆర్ఎస్‌ను దానం నాగేందర్ ప్రశ్నించారు. "కేసీఆర్ హాయాంలో ప్రతిపక్షానికి డిప్యూటీ స్పీకర్ ఎందుకు ఇవ్వలేదు?. స్పీకర్ నిర్ణయం తర్వాత మా నిర్ణయం మేం చెప్తాం. బీఆర్ఎస్ నాయకులు శునకానందం పొందుతున్నారు. సరైన సమయంలో ఏం చేయాలో మాకు తెలుసు. రాష్ట్రాన్ని అడ్డగోలుగా దోచుకున్న వాళ్లు ఇప్పుడు మాట్లాడుతున్నారా?. రాష్ట్ర ఖజానా దోచుకున్న వాళ్లు ఇప్పుడు ఏం అర్హత ఉందని మాట్లాడుతున్నారు?. వాళ్లపై వస్తున్న ఆరోపణలు తప్పించుకునేందుకు మాపై ఆరోపణలు చేస్తున్నారు. బీఆర్ఎస్ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోంది. అనర్హతకి సంబంధించి ఎక్కడ మాట్లాడాలో అక్కడే మాట్లాడుతా. దోచుకున్న డబ్బు దాచుకోవడానికి కేటీఆర్ విదేశాలకు వెళ్లారు. బీఆర్ఎస్ పార్టీలో ఓడిన వాళ్లకి విశ్వాసం లేదు. గెలిచిన వాళ్లకి విశ్వాసం లేదు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఏం చేయాలో అర్థం కాక భయపడుతున్నారు. బీఆర్ఎస్ పార్టీలో ఎవరు మిగలరు" అని దానం నాగేందర్ అన్నారు.

# నేను ఎవరికీ వత్తాసు పలకను.... దేశం కోసమే మాట్లాడతా



వికారాబాద్, సెప్టెంబర్ 10: ప్రతి కార్యకర్తను గుర్తించి గౌరవించే పార్టీ భారతీయ జనతా పార్టీ మాత్రమే అని ఆ పార్టీ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో బీజేపీ సభ్యత్వం నమోదు కార్యక్రమానికి ఎంపీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పూర్తి ప్రజాస్వామ్య బద్ధంగా పార్టీ ఎన్నికలు నిర్వహిస్తున్న ఏకైక పార్టీ కూడా బీజేపీ నే అని చెప్పుకొచ్చారు. తెలంగాణలో రానున్న రోజుల్లో అధికారంలోకి వచ్చే అవకాశాలు ఉన్న పార్టీ బీజేపీ అని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అధికార పార్టీకి ఎన్ని సీట్లు వచ్చాయో బీజేపీకి కూడా అన్నే సీట్లు వచ్చాయన్నారు. వికారాబాద్ జిల్లా గురించి గతంలో ఉన్న నాయకులు అనేక మాటలు మాట్లాడారని.. అభివృద్ధి మాత్రం చేయలేదని విమర్శించారు. హైడ్రా గురించి మాట్లాడితే రేవంత్ రెడ్డికి సపోర్ట్ చేస్తుండని సన్నాయి నొక్కులు నొక్కుతుండ్రని మండిపడ్డారు. "నేను ఎవరికీ వత్తాసు పలకను.... దేశం కోసం ధర్మం కోసం మాట్లాడతా" అని ఎంపీ స్పష్టం చేశారు.

**రాహుల్‌పై కామెంట్స్..** "తెలుగు భాష గురించి అమెరికాలో మాట్లాడుతుంటాడు... ఈయనకు ఎలాగో మాట్లాడడంరాదు ... ఎవడు రాసిచ్చిండోనని చూస్తే శాంపిట్రోడో అనేటోడు రాసించిండు. దేశాన్ని పాలించిన తాతకు తెలియదు... ఇప్పుడున్న మానవుడికి ఈ దేశం గురించి తెలియదు. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేస్తున్న ప్రధాని మోడీ గురించి దేశ విచ్చినాన్ని కోరుకునే వారు రాసిస్తే రాహుల్ గాంధీ మాట్లాడుతుండు. రాహుల్ గాంధీకి పెళ్లయిందని ఓ పత్రిక రాస్తే దాన్ని కూడా తల్లి సోనియా గాంధీ ఖండించలే. రాహుల్‌పై తప్పుడు వార్తలతో నాతోటి ఎంపీ గురించి తప్పుడు ప్రచారం చేస్తుండని బీజేపీ నాయకుడు కేసు వేసిన పరిస్థితి" అంటూ రాహుల్ గాంధీపై విరుచుకుపడ్డారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు బీజేపీ గెలిస్తే నే ఈ దేశం క్షేమంగా ఉంటుందని.. అందుకోసం ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేసి లోకల్ బాడీ ఎన్నికల్లో విజయం సాధించాలని ఎంపీ రఘునందన్ రావు పిలుపునిచ్చారు.

# పెంట్లవెల్లిలో జీరోమాఫీ.. సీఎం బూటకపు మాటలకు ఇదే సజీవ సాక్ష్యం.. రేవంత్ రెడ్డిపై కేటీఆర్ ఫైర్

రుణమాఫీ పూర్తి చేశామని గొప్పలు చెప్పుకున్న ముఖ్యమంత్రి మాటలు బూటకమని రుణమాఫీ పూర్తి చేశామని గొప్పలు చెప్పుకున్న ముఖ్యమంత్రి మాటలు బూటకమని చెప్పడానికి సజీవ సాక్ష్యం.. నాగర్‌కర్నూల్ జిల్లాలోని పెంట్లవల్లి గ్రామమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గ్రామంలోని 499 మంది రైతుల్లో ఒక్కరంటే ఒక్కరికీ రుణమాఫీ కాకపోవడం పచ్చి మోసం కాకపోతే మరేంటని ప్రశ్నించారు. డిసెంబర్ నుంచి ఆగస్టు 15 దాకా డెడ్‌లైన్లు పెట్టిన సీఎం నేటికీ వీరికి రుణమాఫీ ఎందుకు కాలేదో సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. పావు శాతం కూడా మాఫీ చేయకుండా వంద శాతం అయిపోయినట్టు ఫోజులు కొట్టిన ముఖ్యమంత్రికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే.. ఇకనైనా వెంటనే పెంట్లవెల్లి రైతుల గోడు తీర్చాలని అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి సింగిల్ విండోలో 499 మంది రైతులు రుణాలు తీసుకుంటే ఏ ఒక్కరికీ రుణమాఫీ కాలేదు. మూడు విడతల్లో ఒక్క రైతుకు కూడా మాఫీ కాకపోవడంతో వారు ఆవేదన చెందారు. వినతులిచ్చినా, కార్యాలయం చుట్టూ తిరిగినా నెల రోజులుగా అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో పీఏసీఎస్ ముందు సోమవారం రైతులు ధర్నాకు దిగారు.

# తాలిపేరు ప్రాజెక్టుకు కొనసాగుతున్న వరద ప్రవాహం



చర్ల: మండలంలోని తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్టులో వరద ప్రభావం కొనసాగుతోంది. మంగళవారం ఉదయం 6 గంటల వరకు ఎగువ ప్రాంతమైన ఛత్తీస్‌గఢ్ నుంచి 1.60 లక్షల క్యూసెక్కుల వరద నీరు జలాశయానికి వచ్చి చేరింది. నిన్నటి నుంచి భారీగా పెరుగుతున్న వరద మంగళవారం ఉదయం 7 గంటల నుంచి కాస్త తగ్గుముఖం పట్టింది. ప్రాజెక్టులో 24 గేట్ల ద్వారా 58 వేల క్యూసెక్కుల మేర వరద నీరు గోదావరికి వెళ్తోంది. ప్రాజెక్టులో వరద పరిస్థితిని డీఈ తిరుపతి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.




# జస్టిస్ హేమ కమిటీ నివేదిక వేళ కేరళ హైకోర్టు ఆగ్రహం

హేమ కమిటీ రిపోర్ట్ గత కొన్ని రోజులుగా మలయాళ చిత్ర పరిశ్రమను కుదిపేస్తోన్న విషయం తెలిసిందే. ఎంతోమంది నటీమణులు చిత్ర పరిశ్రమలో తాము ఎదుర్కొన్న పరిస్థితులను బయటకు వెళ్లగక్కుతున్నారు. ఈ తరుణంలో కేరళ హైకోర్టు, రాష్ట్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తంచేసింది. మలయాళ చిత్ర పరిశ్రమలో లైంగిక వేధింపులను ఆ కమిటీ బయటపెట్టిన తర్వాత కూడా ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంపై తీవ్ర వ్యాఖ్యలు చేసింది. "మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు మీరు ఏం చేస్తున్నారు..?" అని ప్రశ్నించింది. "నాలుగేళ్లు ఖాళీగా కూర్చున్నారా..?" అంటూ ప్రభుత్వం తీరుపై ఆందోళన వ్యక్తంచేసింది. "రాష్ట్రం ఉదాసీన వైఖరి మమ్మల్ని ఆందోళనకు గురిచేస్తోంది. ఒక కమిటీ వేసి, నాలుగేళ్లు ఖాళీగా కూర్చున్నారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు మీరు ఏం చేస్తున్నారు..? మనలాంటి రాష్ట్రంలో ఇలాంటి పరిస్థితి ఉండటం దారుణం. మన రాష్ట్రంలో మహిళల జనాభానే అధికం. ఈ వేధింపుల వ్యవహారం చిన్న విషయం కాదు. సిట్ అన్ని విషయాలను పరిగణనలోకి తీసుకోవాలి" అని కోర్టు పేర్కొంది. అలాగే ప్రభుత్వం మౌనాన్ని ఒక అవకాశంగా చూడొద్దని, ఈ వివక్షాపూరిత పరిస్థితులు మారాలని స్పష్టం చేసింది. ప్రస్తుతం ఉన్న చట్టాలతో సమస్యలకు పరిష్కారం లభించకపోతే.. కొత్త చట్టాలను తీసుకురావడం గురించి ప్రభుత్వాలు యోచించాలని సూచించింది. 2017లో కొచ్చిలో మలయాళ నటి కిడ్నాప్ కేసు సంచలనం సృష్టించింది. రౌడీలతో ఆమెపై లైంగిక వేధింపులు జరిపినట్లు నటుడు దిలీప్‌పై ఆరోపణలు వచ్చాయి. ఆ కేసులో అతడు అరెస్టు అయ్యాడు. ఈ నేపథ్యంలో మాలీవుడ్‌లో మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సమస్యలపై అధ్యయనం చేసేందుకు కేరళ ప్రభుత్వం 2019లో జస్టిస్ హేమ నేతృత్వంలో కమిటీని ఏర్పాటుచేసింది. ఇటీవల ఈ కమిటీ మలయాళ చిత్ర పరిశ్రమలో మహిళల స్థితిగతులపై పలు దిగ్భ్రాంతికర విషయాలను నివేదికలో పేర్కొంది. సినీ పరిశ్రమలో మహిళల సమస్యలు, వర్కింగ్ కండిషన్లు, రెమ్యునరేషన్, సాంకేతికరంగంలో మహిళల భాగస్వామ్యం మొదలైన విషయాలపై అధ్యయనం చేసిన కమిటీ.. పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంది. పలువురు సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం 235 పేజీల నివేదికను కేరళ ప్రభుత్వానికి సమర్పించింది. ఈ నివేదిక బయటకు వచ్చిన తర్వాత పలువురు నటీమణులు తాము ఎదుర్కొన్న వేధింపులను బయటకు వెల్లడించారు. ఈ ఆరోపణలు కేరళలో సంచలనం సృష్టించాయి. దాంతో కేరళ చిత్రసీమకు చెందిన అసోసియేషన్ ఆఫ్ మలయాళం మూవీ ఆర్టిస్ట్స్(%ూవీహీూ%)కు మోహన్‌లాల్‌తో సహా ఇతర సభ్యులు రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. మరోవైపు, నటీమణుల ఆరోపణలు తీవ్రమైన నేపథ్యంలో వాటిని విచారించేందుకు ముఖ్యమంత్రి విజయన్ ఏడుగురు సభ్యులతో సిట్ ఏర్పాటుచేస్తున్నట్లు ఇప్పటికే ప్రకటించారు.




వాషింగ్టన్: అమెరికా పర్యటనలో ఉన్న కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ.. వాషింగ్టన్‌లోని జార్జ్‌టౌన్ యూనివర్సిటీ చర్చా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ప్రధాని మోదీపై ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆయనంటే తనకు ఎలాంటి ద్వేషం లేదన్నారు. "చెబితే మీరు ఆశ్చర్యపోతారు. మోదీ అంటే నాకు ఎలాంటి ద్వేషం లేదు. చాలాసార్లు ఆయన చేసే పనులను, తీసుకునే నిర్ణయాలను నేను అర్థం చేసుకోగలను. అయితే, ఆయన అభిప్రాయాలు వేరు.. వాటితో నేను ఏకీభవించలేను. అంతేగానీ.. నేను ఆయనను ద్వేషించట్లేదు. శత్రువుగా చూడట్లేదు. ఆయన చేసే పనులను అర్థం చేసుకున్నప్పటికీ.. అవి మంచి ఫలితాలు ఇస్తాయని నేను అనుకోవట్లేదు. మా ఇద్దరివీ విభిన్న దృక్పథాలు" అని రాహుల్ వ్యాఖ్యానించారు.

**రిజర్వేషన్ల రద్దు ఆలోచన అప్పుడే.. రాహుల్ కీలక వ్యాఖ్యలు :** ఈసందర్భంగా సార్వత్రిక ఎన్నికల ప్రక్రియపై కాంగ్రెస్ ఎంపీ విమర్శలు చేశారు. "ఆ ఎన్నికలు పారదర్శకంగా జరిగాయని నేను భావించట్లేదు. భాజపాకు 240 సీట్లు కూడా వచ్చేవి కావు. కానీ వారికి ఆర్థికంగా అండ ఉంది. ఎన్నికల సంఘం కూడా వారికి అనుకూలంగా పని చేసింది. మా బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేసి ప్రచారంపై దెబ్బకొట్టేందుకు ప్రయత్నించారు" అని రాహుల్ విమర్శించారు. కాగా.. అమెరికా నుంచి రాహుల్ చేస్తున్న విమర్శలపై భాజపా నేతలు తీవ్రంగా మండిపడుతున్నారు. విదేశీ గడ్డపై దేశం పరువు తీసేందుకే ఆయన ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు, వాషింగ్టన్ పర్యటనలో భాగంగా కాంగ్రెస్ ఎంపీ పలువురు చట్టసభ్యులు, సీనియర్ అధికారులతో సమావేశం కానున్నారు.

# నిమజ్జనాలకు అనుమతి లేదు.. హుస్సేన్‌సాగర్ వద్ద ఫ్లెక్సీలు!




హైదరాబాద్: హుస్సేన్‌సాగర్‌లో వినాయక నిమజ్జనాలకు అనుమతి లేదంటూ ఫ్లెక్సీలు వెలిశాయి. ట్యాంక్‌బండ్ మార్గంలో జీహెచ్‌ఎంసీ, హైదరాబాద్ పోలీసుల పేరిట ఈ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు సాగర్‌లో విగ్రహాల నిమజ్జనాలకు అనుమతి లేదని అందులో పేర్కొన్నారు. వినాయక విగ్రహాలను హుస్సేన్‌సాగర్‌లో వేయకుండా చుట్టూ ఇనుప కంచెలను కూడా పెట్టారు. హుస్సేన్ సాగర్‌లో నిమజ్జనంపై నేడు హైకోర్టులో విచారణ జరగనుంది. సాగర్‌లో పీవోపీ విగ్రహాలు నిమజ్జనం చేయవద్దని గతంలో హైకోర్టు తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. హైకోర్టు ఆదేశాలు అమలు చేయట్లేదని లాయర్ వేణుమాదవ్ పిటిషన్ వేశారు. ఇందులో హైడ్రాను కూడా ప్రతివాదిగా చేర్చాలని కోరారు. హుస్సేన్‌సాగర్ పరిరక్షణ బాధ్యతలను హైడ్రా నిర్వహిస్తోందని పిటిషనర్ పేర్కొన్నారు.

# బీసీ కులగణనపై తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం



హైదరాబాద్: బీసీ కులగణన 3 నెలల్లో చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. కులగణన పూర్తి చేసి నివేదిక సమర్పించాలని పేర్కొంది. బీసీ కులగణన చేపట్టాలని హైకోర్టులో 2019లో పిటిషన్ దాఖలైంది. బీసీ సంఘం నేత ఎర్ర సత్యనారాయణ ఈ పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై మరోసారి సీజే ధర్మాసనం విచారణ చేపట్టింది. బీసీ కుల గణనపై సుప్రీంకోర్టు ఉత్తర్వులున్నాయని పిటిషనర్ పేర్కొనగా.. అమలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని అడ్వకేట్ జనరల్ కోర్టుకు తెలిపారు. దీంతో తాజా ఉత్తర్వులు ఇచ్చి.. పిటిషన్‌పై కోర్టు విచారణ ముగించింది.

# రామన్నగూడెం పుష్కర్ ఘాట్ వద్ద ప్రమాదకరంగా గోదావరి ప్రవాహం



హైదరాబాద్ : ములుగు జిల్లా రామన్నగూడెం పుష్కర్ ఘాట్ వద్ద గోదావరి నీటిమట్టం మళ్లీ పెరుగుతున్నది. గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో ఎగువన నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతున్నది. దీంతో సోమవారం నుంచి వరద ప్రవాహం క్రమంగా పెరుగుతూ వస్తున్నది. కాగా, మంగళవారం పుష్కర్ ఘాట్ వద్ద రెండవ ప్రమాద హెచ్చరిక చేరువలోకి గోదావరి ప్రవహిస్తున్నది. వరద మరింత పెరిగే అవకాశం ఉండడంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీచేశారు.

కాగా, భారీ వర్షాలతో ప్రాజెక్టులన్నీ నిండుకుండలుగా మారాయి. దీంతో అధికారులు గేట్లు ఎత్తి వరద నీటిని దిగువకు విడుదల చేస్తుండటంతో గోదావరి వరద అంతకంతకూ పెరుగుతున్నది. ఇంద్రావతి, ప్రాణహిత నదుల నుంచి గోదావరిలోకి లక్షల క్యూసెక్కుల వరద వస్తున్నది. చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టుకు ఛత్తీస్‌గఢ్‌నుంచి పెద్ద ఎత్తున వరద నీరు వచ్చి చేరుతున్నది. సోమవారం నుంచి లక్షన్నర క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న గోదావరిలోకి అధికారులు విడుదల చేస్తున్నారు. కాగా, గోదావరి ప్రవాహం 48 అడుగులకు చేరితే రెండో ప్రమాద హెచ్చరికను జారీచేయనున్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com